అ భి న వ స ర స్వ తి

సంపుటము 30	శ్రీబహుధాన్య సంవత్సరము జ్యేష్ఠమాసము	సంచిక 3

— ♦ కృతివిమర్శము ♦ —

భగవద్గీత- తెనుఁగువచనము—తుపాకుల అనంతభూపాల ప్రణీతము. తెనుఁగు భాషలో నిట్టిగ్రంథ మీవఱకుఁ బ్రకటింపఁబడియుండలేదు- తేనెతేటవంటి తెనుఁగున రచింపఁబడినది.

శ్లో॥ అమానిత్వ మదంభిత్వ మహింసా క్షాంతి రార్జవం
ఆచార్యోపాసనం శౌచం స్థైర్య మాత్మవినిగ్రహః, 13 అ. 8

ఇంద్రియార్థేషు వైరాగ్య మనహంకార ఏవచ
జన్మమృత్యుజరావ్యాధి దుఃఖదోషానుదర్శనం 9
అసక్తి రనభిష్వంగః పుత్రదారగృహాదిషు
నిత్యంచ సమచిత్తత్వ మిష్టానిష్టోపపత్తిషు 10
మయి చానన్యయోగేన భక్తి రవ్యభిచారిణీ
వివిక్తదేశసేవిత్వ మరతి ర్జనసంసది 11
అధ్యాత్మజ్ఞాననిత్యత్వం తత్త్వజ్ఞానార్థదర్శనం
ఏతద్ జ్ఞానమితిప్రోక్త మజ్ఞానం యదతోఽన్యథా. 12

అను మూలమునకుఁ దెనిఁగించిన “అభిమానము దంభము లేకయుండుట యహింస క్షాంతి ఋజుభావము నాచార్యోపాసనము శుచిత్వము స్థైర్యము శరీర నిగ్రహము విషయంబులయెడ వైరాగ్యము నహంకారరాహిత్యము జన్మమృత్యుజరా వ్యాధులవలని దుఃఖదోషములం బరికించుటయుఁ బుత్రదారగృహాదులయం దాసక్తియుఁ బ్రీతియు లేకుండుటయుఁ బ్రియాప్రియులయందు సమచిత్తుండగుటయు నన్యదేవతాభక్తుండు గాక నాయందు గాఢంబగు భక్తియు నేకాంతవాసంబును బ్రాకృతజనంబులయెడలఁ బ్రియంబు లేకుండుటయు నాత్మజ్ఞాననిష్ఠుండగుటయుఁ దత్త్వజ్ఞానంబును బ్రయోజనంబైన మోక్షవిచారంబును నను నిదియంతయు జ్ఞానం బని పలుకంబడు. దీనికి విపరీతంబైనదంభమానంబు అజ్ఞానం బనందగు” అనునది కనుగొనిన నీభగవద్గీత తెనుఁగువచనముశైలి తెలియంబడెడిని-ఇట్లే

శ్లో॥ లోభః ప్రవృత్తి రారంభః కర్మణా మశమ స్స్పృహా
రజస్యేతాని జాయంతే వివృద్ధే భరతర్షభ! 14 అ. 12

అప్రకాశోఽప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవ చ
తమ స్యేతాని జాయంతే వివృద్ధే కురునందన! 13

మొదటిదైనవానికి వ్రాసిన "భరతర్షభా! లోభంబును బ్రవృత్తియుఁ గర్మారంభమును దాలిమిలేకుండుటయు నిచ్ఛయు నను నీగుణములు రజోగుణంబు వృద్ధిపొందినపుడు జనించు. కురునందనా! వివేకభ్రంశంబును ననుద్యమంబును హెచ్చరికతప్పుటయు మోహంబు నను నీగుణములు తమోగుణంబు వృద్ధిచెందునపు డావిర్భవించు" మొదటిదైనది చాల బాగుగానున్నది. కవితాప్రవీణంమన్యులై కావలసినంత యభిమానముతోఁ బద్యశైలి నాంధ్రభగవద్గీతలని వ్రాసినవా రనేకులున్నారు. కాని యవ్వారి గ్రంథములకంటెఁ జాల సుగమమైన యీ ప్రాచీనభగవద్గీత తెనుఁగువచన మాంధ్రభాషామాత్రజ్ఞానముగలవార లందఱు నవశ్యపఠనీయము- నవనాగరకుల దగ్గఱనుంచి భగవద్గీతను బారాయణముచేయుచుఁ బ్రమాణగ్రంథముగా భావించుచున్నారు. వారి కందఱ కీవచనభగవద్గీత చక్కగా నీతిని గఱపఁగలదు. చూడుఁడు. "పార్థా! దంభంబును దర్పంబును నత్యంతాభిమానంబును గ్రోధంబును బరుషభాషణంబును నజ్ఞానంబును నను నివి మొదలుగాఁగలగుణంబు లసురసంపద చెందినవానికిఁ గలిగియుండును. పాండవా; మోక్షంబుచెందుటకు దైవసంపదయును బంధంబునకు నసురసంపదయును నిశ్చితంబులైయుండు... అసురసంపదం జెందినవారలు ధర్మాధర్మంబులయెడఁ బ్రవృత్తినివృత్తు లెఱుంగఁజాలరు. శుచిత్వంబును నాచారంబును సత్యంబును వారియం దుండదు... వేదశాస్త్రంబు లసత్యంబనియును ధర్మాధర్మంబులు లేవనియును...ఈశ్వరుండని యొకండు లేఁడనియును గామంబుచేనైన స్త్రీపురుషుల యన్యోన్యసంపర్కంబే సృష్టికి హేతువనియును వేఱొకండు లేదనియును బలుకుదురు. ఇటువంటి దృష్టి నవలంబించి నష్టమనస్కులును బుద్ధిహీనులునై యుగ్రంబులైన హింసాదికర్మల నాచరించుచు జగంబునకు శత్రువులై లోకనాశంబుకొఱకు జనించుచుండుదురు, ...కామభోగంబులే పరమార్థంబులని తలంచి యింతమాత్రంబే కాని వేఱొండు లేదని నిశ్చయించి మరణపర్యంతంబును దత్సాధకంబులైన యర్థంబులందే కోరికలు కలవారలై, యాశాపాశంబుల బద్ధులై కామభోగంబులకొఱకు నన్యాయార్జితంబులగు ధనంబుల సంగ్రహించుచు నరకంబులం బడుదురు...వర్ణానుగుణంబైన కర్మంబు లాచరించువానిని బాపంబు చెందదు.

— ♦ ధార్మికవిద్వత్సమాధేయ చతుర్దశధర్మప్రశ్నమాలకుఁ బ్రత్యుత్తరము ♦ —

(గాడేపల్లి వీరరాఘవశాస్త్రిగారు. గద్వాలసంస్థానవిద్వాంసులు)

(1) ఋషులకును దదర్వాచీనులకును దేశకాలాద్యనురోధ ధర్మాధర్మసంస్కరణమునం దన్నివేళలలోను సంపూర్ణమైన హక్కు కలదు. లేదనిచెప్పిన సీమంతపుంసవనానవలోభోన్నయన జాతకర్మాన్నప్రాశనాదులు పూర్తిగా మార్పఁబడినవి.

సపిండీకరణాదులు శాఖాభేదాదులు సంధ్యావందనాదులు సహితము మార్పులతో నిండియున్నవి. అగుఁగాక. ఋషులైనను సంప్రదాయదేశాదులను బట్టి యీషద్భేదముతో నుపయోగించినను నామార్పుగూడ వేదోక్త సకలకాలాబాధ్యమానమై యుండవలయును. నదీమూలములు పర్వతములైనట్లు ఋషిమతములుగూడ వేదములును సంప్రదాయావిరుద్ధములును నై యాచరణసౌలభ్యముకొఱకు గంధమునఁ గస్తూరి పునుఁగు మున్నగు వానిలోని మార్పులవలె దిద్దఁబడవలెను. అట్టిమార్పు ఋషులును వారిని ఋరుడించు నవీనులుగూడ నొనరింప ఘంటాఘోషముగ నర్హులే. కాని యట్టి యర్హత జాతిభ్రష్టులును ఈర్ష్యాళువులును సంకర చికీర్షువులును వేదానభిజ్ఞులును వేదోక్తశాస్త్రము లేవియో యతిక్రాంతమర్యాదాభాగము లెందో కానని వారును నేవి తెలిచినఁ ఋశోభివృద్ధి కాటంకము మూలచ్ఛేదము నగునో యట్టిదూరదృష్టి లేని వారును 'బాపము దానిదిమాత్రము ప్రాణము కాదా, మలమూత్రకోశములలో వాయువు వలనీసంత రాక యాహారము చాలినంతగ లేక రోదనమొనర్చునని గర్భోదయము ధ్రువపడఁగనే మాతృగర్భమునుండి జరాయుపిండమును వెకలించి వెలికిఁదీయుటయే దయ' యనువారలును నీటిలో నూపిరాడకున్నదని చేఁపలను గట్టునకుఁ జేర్చి యభివృద్ధి పఱుపఁదలఁచువారును నైన యేమియు నెఱుఁగని నవనాగరకసంస్కర్తలను మాత్రము సంఘము బహుళమై చేతులెత్తుటచే నుండదు. విచారణీయాంశము నామూలాగ్ర మెఱిఁగి యనసూయాపరాయణతగలవారి సంఘ మేర్పడిన వారిలో నెక్కువసంఖ్యగలవారి యభిప్రాయ మవసరము. అతితీవ్రవాదు లక్కఱలేదు. జాతిభ్రంశత నొంది యదియే నాగరకతగ సమర్థింపఁదలఁచువా రక్కఱలేరు. సనాతన మతమునుండి వెలికి నడుచనివారును దత్సంప్రదాయప్రయోజనరహస్య మెఱిఁగిన వారును వారి కనుగుణము నైన సంఘమే సర్వదా వేదోదితమార్గసౌలభ్య మాదేశింప నక్కఱగల్గియున్నది. ఇండ్లుకట్టునపు డిటికె మంచిదా, గచ్చు మంచిదా, రాయి మంచిదా, పెంకు మంచిదా? అనుప్రశ్న గ్రామవాసులలో ననుభవించువారికిని గట్టింపఁదగిన శాస్త్రమైన నేర్చిన యింజనీయరులకును దెలియును. నారిసలహా లవసరము కాని యడవులలోని చెంచు లంబాడీ యానాది కుంటి గ్రుడ్డి మొదలగు బిచ్చగాండ్ర వోట్లనొనరించిన సంఖ్యాధికు లగుదురా? వారా నిర్ణేతలు? పాశ్చాత్య దేశాచార సౌలభ్య నిర్ణయ మొనర్చుటకును ఋరుషాంతరప్రాప్తసంతానభాగనిర్ణాయికాఖ్యానవ్యాఖ్యానములకును నాంగ్లము నాసనయే యెఱుఁగని సోమయాజుల నుసికొల్పి చేతులెత్తించిన నేమగునో యిదియు నట్లే. శరీరమున నాపరేషనుచేయుట కేభాగము దుర్బలమైనఁ దీయవచ్చును, ఏది కదలించినఁ బ్రాణాపాయము, అని డాక్టరుల నడుగవలయునా? మనముగూడ నిష్టానిష్టములతోఁ జేతులెత్తిన నుపయోగించునా? మీమాంసాన్యాయదృష్టియైనను నాధునికచారిత్రకదృష్టియైనను సంప్రదాయావిరోధముగ నున్న నుభయ మంగీకారమే. లేదా? రెండును సంఘవిమర్శనీయాంశములే. సంఘ మసంస్కృతానభిజ్ఞముగ నుండఁగూడదు రహస్యానుపపత్తు లడుగు వేదచక్షువులకు జవా బాసంఘము సర్వదా మార్గమునందే నిల్పి

యీవలెనుగాని మడిపు ద్రిప్పరాదు. సంస్కరణ మెప్పుడుఁ దదనుసారి సులభమై సన్మతప్రవర్తకముగ నుండవలెను.

(2) ప్రభువు శాసనసభ్యులు శాసనముల ననుసరించి పాలించుటకే హక్కు-దారులు. నవీనకల్పనలకుఁ బ్రభువు నిర్ణయకర్తగనుకఁ బ్రజాక్షేమ ప్రభుత్వోపయోగములను బట్టి స్వతంత్రశాసననిర్మాతగ నగుచున్నాఁడు. మతధర్మములలోఁ బ్రభువులు వేదములు. భిన్నభిన్నవ్యక్తి పరిపాలనలోఁగూడఁ బ్రభువాక్యములుగ వేదములు పరిగణింపఁబడియున్నవి. తాదృగ్వేదోదితబహిష్కరణ సూత్రమే వేదధర్మప్రజ్వాలక లోకసుఖాభివృద్ధిమార్గదర్శక నేత్రహస్తప్రాయము. ఆబహిష్కరణసూత్రమును బరిపాలనపుఁ గట్టుబాట్లకు భీరువులై భ్రష్టు లుల్లంఘించి తాముల్లంఘించిన దొడ్డికంప లాగివేయఁ జేతులెత్తుచున్నారు అట్లుల్లంఘించిన వారిని క్షమాపణపూర్వకముగ సాంఘికాచారలాలసులుగ విధించుటకును నిగ్రహశక్తిగల వేదప్రభువెట్లంగీకరింపఁగలఁడు! వారు భ్రష్టులై ధర్మనిగ్రహమొనర్చు సంఖ్యాధికులమైతిమని వేదప్రభునిగ్రహమునకు వెరపడుచున్నారు. బహిష్కరణసూత్రము దూష్యమని లాగులాడుచున్నారు. నేఁటిప్రభుత్వమునకును బ్రజాప్రభుత్వమూలమగు కాంగ్రెసునకును జీవాధార మాబహిష్కరణసూత్రమే. కాదా! అనుపదము నాబహిష్కరణసూత్ర మంతవిశ్వాసమున నుండ నద్దాని సృజించి మనకిచ్చి ప్రమాదరహితమార్గమని యాదేశించిన వేదమాత బహిష్కారము నేర మెట్లగును! ప్రభువులు శాసనసభ్యులు మతధర్మపరివర్తనము చేయ నభిలషించినను బ్రజాపరిపాలన విషయమునఁ బ్రభువుఁ బార్లమెంటు నెంతయవసరమో మతవిషయమునఁ బ్రభుశక్తిగల వేదమాతయుఁ దదనుష్ఠానపారీణ సనాతనకోటియు నంతయవసరము. ఏసంఘమునకేది సౌలభ్యమో యాసంఘమున కది కల్పింపవలయునుగాని విదేశాచారలాలసులఁ గులీనులఁ జేయఁగోరి వీరి వశరంధ్రము లవిచారముగ మూయు శాసనము లొనర్ప వీలులేదు. వీరిధర్మము లితరులు గుఱుతింపవలయునన్న వేద మీ జన్మమున రాదు. ఆచారముల కట్టుబాటులు వారి దృష్టిలో దుస్సహములు. వారి మిత్రులు బంధువులు విదేశాచారులు. వారికి సంస్కార మీజన్మమున నభిసమ్మతము. మఱియొక జన్మము వారొప్పనే యొప్పరేమో? పీడ వదలును. ఒప్పిరా? ఏ క్రిమికీటక సరీసృపాదులలోని కీవివేకశూన్యత లాగునో? వారికీసంస్కరణవాదమేల? అగౌడన కావలసిన నంతో యింతో తెలిసి కొదవ తెలియఁగోరి దానిలాభ మనుభవింపఁగోరు వారి కవసరమే. పనిలేనిపనితో నెల్లుకుఁ దోఁక తెగిన నక్క తేలకారని పలుక్క-కెందులకు? ధర్మవిరుద్ధముగ రాజు బలాత్కరించి జాతిభ్రష్టుగా నొనర్చిన నతఁడు జాతిభ్రష్టుఁడు కాఁడు. కాలభేదమునుబట్టి పశ్చాత్తాపాది సులభమార్గములతోఁ దన వైఖరిని వెల్లడింపఁజేసిన నాపద్ధర్మకోటితో సంఘాంగీకార మీఁదగియున్నాఁడు.

(8) గర్భాష్టమేషు బ్రాహ్మణ ముపనయీత గర్భైకాదశేషు రాజన్యం. గర్భద్వాదశేషు వైశ్యం. గర్భాష్టమమనిన 7 వ సం॥ 8, 9, 10 పర్యంత ముపలక్ష

ణము. రాజన్యులకు నియమించిన గర్భైకాదశమునకుఁ బూర్వమైన నొనరించుట యాపద్ధర్మమైన గౌణకాలమని విజ్ఞులు నిర్ణయించిరి. కాని పదియేడో యిరువదియేడో యని చెప్పలేదు. ఇంకఁ గన్యాదానమనిన నష్టవర్ష పరిమితమనియు నప్పుడే దానార్హతయనియుఁ దద్వ్యతిరేక కాల మెవ్వరికిని గొఱమాలినదనియు, ఇది బ్రాహ్మణ జాతియొక్క నియమమే కాదనియు ననుష్ఠింపఁ జేతనైనఁ బ్రతిమానవుని దీప్తిమత్సంతానాభివృద్ధికిని నన్యోన్యప్రేమ పెంపొందుటకును నిదియే పరమధర్మమనియు నేనొక గ్రంథమును విస్తరించి వ్రాసియున్నాను. వలయువా రందు సవిమర్శముగఁ దిలకింపవచ్చును. ఈ యెనిమిదవయేటనిగూడ 9, 10, 11 వఱ కుపలక్షణముగను నుదకుఁ గొంచెమించుమించు రజోదర్శనమునకుఁ బూర్వము పరమావధిగను నొచితిని బట్టి మార్పు లోకానుకూలముగ వైదికసంఘమే యాచరణమం దుంచియుండెను. ఐతే వైదికసంఘములోఁ గొందఱాతురులు నెలబాలలు కుయ్యేలలలోఁ గన్యాదాన మొనరించి కక్కుఱితిదీర్చుకొన మొదలిడిరి. వారిని సంఘము తిరస్కరింపలేదు. ఇదిసంఘదుర్బలతయని గుర్తెఱిగిన నవనాగరకు లతిబాల్యవివాహ నిషేధ స్తంభమును జాటుంచుకొని విధవావివాహ ప్రౌఢావివాహ సంతానవతీవివాహాదుల దగ్గఱనుంచి స్వేచ్ఛానుబంధములకును విడిపోరాని చట్టములను బంధింప మొదలిడిరి. ఉభయులు సాహసులే. కనుక నుచిత మెఱిగిన సనాతనసంఘము పురుషుల నెట్లుపలక్షణముతో నియమించెనో కన్యకలను నట్టి కృపాపూరిత చిత్తముతోనే రజోదర్శనమునకుఁ బూర్వమునకును స్వేచ్ఛ యొసంగెను. అంతకును సకలమతసామరస్యముగ నున్నది. శ్రుతిస్మృతిధర్మశాస్త్రములనుచో నుపపత్తి కల్గించిన వెల్లడించుటకు సంఘమున్నది

(4) నిర్బంధశాసనవిస్వరమున గళగ్రాహులైన యశాస్త్రీయరజోదర్శనానంతరవివాహ పతితసంఘాంగీకార సంకలీకరణములలో సనాతనులకు గతియేమనిన నధోగతియే. పరిత్రాణాయ సాధూనామును వినువ్రుట్టుకును స్మృతిదప్పవలకు రువ్వులువేయుటయే. బ్రాహ్మణత యన్ని ధర్మము లనుభవించుబాధ్యత గల్గియుఁ బ్రతిరాజకీయమునను సంస్కరణ చేయక ప్రక్క కొదిగి బహుకాలము గతించినను గనులు విప్పి గమనింపలేదు. దుర్బలత రానున్నదని ప్రతీకార మూహింపఁజాలని బ్రాహ్మణత కిప్పు డధోగతిగాక మఱేమిశరణ్యము ? అధమవర్ణములకుఁగూడ శాసనసభాబాధ్యతలలోఁ బ్రధానస్థానము లర్థించి సాధించుచుండ శాసనసభలలో లేదుకదా, సామాన్యమైన మ్యునిసిపాలిటీల యుద్యోగములే బ్రాహ్మణజాతిలో నెవ్వరికి నింకఁ బ్రసాదింపరాదనియు నిచ్చుపట్ల నిమ్నజాతులచేనన్నియుఁ బూరింపఁబడినపైఁ గొదవయున్న స్థానములకు వారి యవసరమునుబట్టి వారే బ్రాహ్మణుల కిత్తురనియుఁ జట్ట మేర్పఱచిరి. బ్రాహ్మణోద్యోగి వ్యక్తులు ప్రభుత్వమున కితర జాతులవలన నేభాగమునఁ బని బొత్తిగా జరుగక నష్టికలుగునో యట్టి నష్టిని నివారించుటమాత్రమే ప్రయోజనముగాఁ దనువులు ధరించుచున్నవి. ఇట్టి దారుణ దండనలోనైనను బ్రాహ్మణులు కనులు విప్పిరా ? నిస్తేజమైన బ్రాహ్మణేతరశబ్ద

మన్నిమతముల శిరముల నలంకరించినది. పోనీ బ్రాహ్మణులు ప్రభువులుఁ బ్రజలు బహిష్కరించినపుడు సంఘముగ నేర్పడి యాత్మశక్తితోఁ బ్రతీకార మన్వేషించిరా? పతితులు సంకరులుఁ దరతరములనుండి వెలిగానుండ నభ్యాసపడిన ట్లీబ్రాహ్మణులును సహజసిద్ధమైన తమయనేకత విడుఁజాలక యెక్కడి కక్కడనే విరిసిపోవుచున్నారు. తుదకు వీరు వితంతువులవలెఁగూడఁ గాఁజాలక క్రింది కరుగుచున్నారు. వితంతువులకు భరణము పుట్టుట కాస్తి లేకపోయినను దండన లేదు. స్వేచ్ఛ యున్నది ఆస్తికల్గి భరణమేర్పడెనా, కులధర్మములతోఁ గూర్చున్నచోటఁ దాము తినను నొకరికిఁ బెట్టను వీలుకలదు. బ్రాహ్మణులకో? కదలిన శాసనములు, దండన. తిండికి లేక బండపకీరులవలె భిక్షకుఁ బోయినను లభింపదు. కనుక వీరి గతి వీరిదే. ఇప్పటికైనను గమనించిన, కలదు సాంఘికశక్తి. (సశేషము)

—♦ విరూపాక్షపీఠాధిపతులకు విజ్ఞప్తి ♦—

శ్రీమత్పరమహంసేత్యాది బిరుదాంకితులగు శ్రీ విరూపాక్ష పీఠాధిష్ఠిత
శ్రీమత్సచ్చిదానందాభినవశంకరభారతీస్వాములవారి దివ్యచరణసన్నిధికి.

సనాతనధర్మపరిపాలకా! సద్గురూ!

శ్రీమద్దర్శనలాభము కలిగినందుకుఁ బునీతులమైతిమి దేశకాలపరిస్థితులు మారుచున్నవి. ప్రస్తుతము సనాతనధర్మము నామమాత్రశిష్టమై యున్నది. ఇకొకదశాబ్దమున కిదియు నంతరించునని యన్యమతప్రచారకుల యొత్తిడి చేతను నిప్పటి పరిస్థితులవలనను నొక్కిచెప్పుట కెంతమాత్రము సందియము లేదు. కావున దయార్ద్రహృదయులరగు శ్రీవారు ప్రస్తుతపరిస్థితులను గమనించి వీని కనుగుణముగా సనాతనమతప్రచారము గావించు టత్యవసరమని మనవిచేయుచు నాస్థూలదృష్టికి గోచరించిన కొన్నియంశముల నీదిగువ నుదాహరించుచున్నాఁడను.

(1) కలియుగమున సంఘబల మత్యవసరము కావునఁ గొన్ని గ్రామముల కైనను గనీసము తాలూకాకొకటైనను దాలూకాలో నివసించు గ్రామస్థుల యెన్నిక ప్రకారము సనాతనసంఘముల స్థాపించుటకై ప్రయత్నింపవలయును. ప్రతిగ్రామమునకు నొకరివంతునైనఁ దాలూకాసంఘమునఁ గనీసము మూడుమాసముల కొకతూరియైన సమావేశము కావలయును.

(2) నిజాము రాష్ట్రమున నగు ప్రతిబహిరంగసభలోను బాల్గొని యుపన్యసించుట కొక ప్రతినిధిని శ్రీవారిపక్షమున నేర్పాటుగావింపవలయును.

(3) నిజామ్రాష్ట్ర రాజకీయమతశాఖాధ్యక్షునివల్లనుండి చేయఁబడు ప్రతిమతవిషయకశాసనమునకు నభిప్రాయము నొసంగుటకై యొక స్థానమును సంపాదించి శ్రీవారి ప్రతినిధి నేర్పాటుచేయవలయును.

(4) హైదరాబాదు రాజధానియం దొక నిజామ్రాష్ట్రీయ సనాతనకేంద్రసంఘము నేర్పాటుచేయవలెను. ఈసంఘమునకు మతశాఖామంత్రి కడ నేర్పఱచిన

ప్రతినిధినే యధ్యక్షునిగా నియమింపవలెను. రాష్ట్రములోని ప్రతిసనాతన సంఘము లోఁబడియుండవలయును. కేంద్రసంఘాభిప్రాయానుసారము వర్తింపవలెను.

(5) నిజామ్‌రాష్ట్రములోని బహిరంగసభలలో నుపన్యసించుట కేర్పాటు గావించిన ప్రతినిధియే సనాతన సంఘములకు వత్సరమున కొకతూరి యైనను బోయి వానియొక్క కార్యక్రమమును వీక్షింపవలయును. అప్పుడప్పుడు గ్రామములకు వెడలి ప్రచారము గావింపవలయును

(6) వత్సరమున కొకతూరి నిజామ్ రాష్ట్రీయ సనాతనమహాసభను సమావేశపఱుపవలయును. ఈసభకు శ్రీవారే యధ్యక్షపీఠము నలంకరింపవలయును.

(7) హైదరాబాదునగరమున నర్హులగు విద్యార్థులకై యొక పాఠశాలను స్థాపింపవలయును. ఇది రెండుశాఖలుగా నుండవలయును ఒకటి వేదపాఠశాల. మఱొకటి సంస్కృతాంధ్రపాఠశాల ఇందుఁ జదువు విద్యార్థులకు భోజనాది సౌకర్యముల నేర్పాటుగావింపవలయును ప్రతిఫలశూన్యముగనైనను సరియే, లేక విద్యార్థుల తల్లిదండ్రులవల్లనుండి ప్రతిఫలము గ్రహించియైనను సరియే.

(8) నిజామురాష్ట్రమున వసించు శ్రీవారి ప్రతిశిష్యుఁడును వైయంశములను నెఱవేర్చుటకై ప్రతివత్సరముఁ గొంతధనసాహాయ్యము చేయవలయును. ఈధనమును దాలూకాసంఘముల ద్వారమునఁ బ్రోగుచేసి కేంద్రసంఘమునకుఁ బంపవలయును.

(9) కేంద్రసంఘము వారు సమయోచితప్రచారము గావించుటకుఁ దాలూకాసంఘములకుఁ దెలుపుచు వలయునెడలఁ గోరినవిషయములకు సమాధానము నొసఁగవలయును. మాసమున కొకతూరి శ్రీవారి సన్నిధికి మాసచర్యను బంపవలయును.

నాదృష్టికి గోచరించిన కొన్ని యంశములుమాత్రము విన్నవించుకొని యున్నాఁడను గానఁ జిత్తగించి యచిరకాలమున ఫలవంతము చేయ మమ్మాశ్రమిల ప్రార్థించుచు శ్రీవారి చరణసన్నిధి నీవినతిపత్రికను సవినయముగ సమర్పించుకొనుచున్నాఁడను.

ఇట్లు
సనాతనమతాభిమాని
దు. భో. వెంకటరాజేశ్వరసిద్ధాంతి
శంకరంపేట.

శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యవర్య...
శ్రీవిరూపాక్ష ... శ్రీ శ్రీ జగద్గురు
శ్రీమత్సచ్చిదానందాభినవశంకరభారతీస్వాములవారి సన్నిధినుండి,

అస్మదత్యంతప్రియశిష్యులయిన మెదకుజిల్లా, అందోలుతాలూకా సనాతనధర్మాభివర్ధక సంఘమువారికి వ్రాయించిన దేమనఁగా:-

(1) ప్రకృతకాలపరిస్థితుల ననుసరించి మీరు చేయు సనాతనధర్మరక్షణము విషయమునకుఁ జాల సంతసించితిమి. అచ్చటచ్చట ధర్మరక్షకసంఘములను స్థాపిం

చుచును దీనిని గుఱించి ప్రచారము చేయుచును సీవిషయములను మాసన్నిధికిఁ దెలుపుచును నుండవలయును.

(2) సర్వశిష్యులకును వీరు స్థాపించు సంఘములకును గార్యక్రమమునకును ననుయాయులై ప్రోత్సహించుచు నుండవలయునని యాజ్ఞ యీయనైనది. సనాతన ధర్మాభిమానులును బీరాభిమానులును నైన శిష్యులకు విశేషించి వ్రాయింపవలసిన దేమియున్నది ?

ఇతి నారాయణస్మృతిః.

—* నల్లగొండ *—

(శేషాద్రిరమణకవులు)

ఇది యొక మండలస్థలము. రెండుకొండలకు మధ్య గ్రామము నిర్మింపఁబడి యున్నది. రెండు కొనల చివర దృఢమగు మట్టికోట గలదు. ఇందొక కొండను గాపురాలగుట్టయని వ్యవహరింతురు. పూర్వ మిందుఁ జౌరులు సైనికులు నివసించిన గుర్తులు కలవు. కొండపై దృఢమగు గొప్ప దుర్గము కలదు. నల్లగొండపేరు చరిత్రగ్రంథములలోఁ జిరకాలము నుండి వినవచ్చుచున్నది. ఇది నలుని దుర్గముగల కొండయగుటచే నల్లగొండయను పేరు వచ్చినదని కొందఱందురు. విదర్భాపురము నలుని రాజధాని. ఇది నిజామురాష్ట్రములో బీదరనుపేరుతో నున్నది. ఇటులే యుస్మానాబాదు చెంత నలదుర్గమను నొకదుర్గము కలదు. వీనిని సమన్వయించి నల్లగొండ ప్రాచీనస్థితి పరిశోధింతుమేని నలుని రాజ్యమునకు నల్లగొండకు సంబంధము లేకపోలేదనియు నలుఁడు నిజామురాష్ట్రములోని యొక రాజనియు ద్యోతకము గాకపోదు.

—♦ సనాతనుల కార్యక్రమము ♦—

[పెద్దిభొట్ల వీరయ్యగారు బి. ఏ. బి. ఎల్.]

కాంగ్రెసువారు నియంతలకన్న నధికముగ నియమములనియుఁ గ్రమశిక్షణ మనియు వ్యక్తిస్వాతంత్ర్యము నణఁచివేయుచున్నారు. వీరికి మతనియమములు పనికి రావు. ప్రపంచములోని అన్ని మతముల వారు నింతవఱకుఁ బూర్వము స్వధర్మాచరణకుఁ బ్రాముఖ్య మొసఁగుచుండిరి. ఇప్పుడు హైందవులలో సంస్కర్తలగు పాశ్చాత్యవిద్యాధికులు స్వధర్మములఁ ద్యజించి మతశూన్యులై యుండుట సంభవించుచున్నది. మహమ్మదీయులలోఁ గాని క్రైస్తవులలోఁ గాని యిట్టి విపరీతపరిస్థితిని గాంచుటలేదు. రాజకీయములందుఁ బలుకుబడి సంపాదించిన కాంగ్రెసువారు హిందూమతసాంఘిక విషయములలో జోక్యము కలిగించుకొనుచుఁ గాంగ్రెసు యొక్క మత తాటస్థ్యమును మంటఁ గలుపుచు శాసనములచే సనాతనులను గష్టపెట్టుచున్నారు. ఇట్టిసమయమున సనాతను లేమి చేయవలెనో సూచించియున్నాను. అది రాఁబోవు ఎన్నికలలోఁ గాంగ్రెసు వారితో సనాతనులు సహాయనిరాకరణ

మవలంబించుటయై యున్నది. కాంగ్రెసువారి యక్రమములను గొంతవరకుఁ జర్చించియున్నాను.

రాజకీయములందే కాంగ్రెసువారితో భిన్నాభిప్రాయముగలవారు కొందఱు గలరు. సనాతనులకును గాంగ్రెసువారితోపాటు స్వరాజ్యసాధనమే యత్యవశ్యమై యున్నది. సనాతనులకు వ్యతిరేకములగు పనులు శాసనసభలలోఁ జేయుటకుఁ బూనుకొనిన కాంగ్రెసువారు సనాతనుల వోట్లకై యాచించుట కడుంగడు మోసము. ఇఁక నేమికావలెను? గాంధీమహాత్ముఁడు బోధించెడి సత్యము నీకాంగ్రెసువా రెంతవఱకుఁ బాటించుచున్నారో సనాతనులు గమనించవలెను. కాంగ్రెసువారు పలుపాట్లుపడి కొంత సంఖ్యాబలమును సంపాదించినమాట నిజము. కాని యింతవఱకుఁ గాంగ్రెసువారికి సహాయులుగ నున్న సనాతను లాసంఖ్యలోఁ జేరియున్నారు. సనాతనుల సంఖ్య ప్రత్యేకముగ గణింపఁబడినమీఁదట గాని కాంగ్రెసువారి బండారము బైటఁబడదు. అప్పుడు కాంగ్రెసువారు తప్పక తల తడవికొనుచు జరిగినదానికిఁ బశ్చాత్తాపము తెలియఁజేయుచు సనాతనులతో రాజీకి దిగఁగలరు. సనాతనులు నిజమునకుఁ గట్టుపడి తమ మత ధర్మములను రక్షింపఁ గంకణము దాల్చి కాంగ్రెసువారి మొంగమోటమికి లొంగక సంచరించిరేని వ్యతిరేకమగు శాసనములంతరించఁగలవు. ఇందుకు సాహాయ్యనిరాకరణమే శరణ్యము.

షెడరేషనును గాంగ్రెసుకు వ్యతిరేకముగాఁ బ్రజలపై రుద్దుటకు బ్రిటిషువారు చేయుప్రయత్నమును సాహాయ్యనిరాకరణపద్ధతి నవలంబించి కొనసాగకుండఁ జేయుటకై కాంగ్రెసువారు పూనుట లేదా - ఆంధ్రరాష్ట్రము నేర్పాటుచేయుటకుఁగల యాటంకములను సాహాయ్యనిరాకరణమువల్ల నిర్మూలించుట కాంధ్రులు సంసిద్ధులై యుండుటలేదా - పై రెండువిషయములను గుఱించి 18-5-1983 తేదీగల యాంధ్రపత్రికయొక్క ప్రధానవ్యాసము చూచినయెడలఁ గాంగ్రెసువారియొక్కయు నాంధ్రులయొక్కయుఁ గార్యదీక్ష తెలియఁగలదు- మతవిషయములో సనాతను లవలంబింపవలసిన కార్యదీక్ష యంతకు హెచ్చుగా నుండఁగలదు. మనము కార్యశూరులము కావలెను. ఇంతవఱకు సనాతనులు గనఁబఱచుచున్న యుపేక్ష పోవలెను. సనాతనులారా! మతసంరక్షణకై లెండు. నడుములు కట్టుఁడు. గ్రామములలోఁ గాంగ్రెసువారు మన మతమునకుఁ జేయుచున్న యపచారములను వోటర్లకు బోధింపుఁడు. మనబోధను నమ్మువారివల్ల మన ప్రచారమునకు సహకారము నాశింపుఁడు.

ముందుగా నన్నిజిల్లాలముఖ్యపట్టణములందు సనాతనసంఘముల నేర్పాటు చేయుఁడు. సంఘాధ్యక్షునిపేరుఁ గార్యదర్శిపేరుఁ గల్పవల్లిమొదలగు సనాతన పత్రికలలోఁ బ్రచురింపుఁడు. అదేవిధమునఁ దాలూకాల ప్రతిముఖ్యపట్టణమున నొక సంఘ మేర్పడవలెను. క్రమముగా వీలువెంట గ్రామసంఘముల నేర్పాటుచేయవలెను ప్రతిగ్రామసంఘమున 5 గురు సభ్యులైన నుండవలెను. ఉపన్యాసములతోను సభలతోను బనిలేదు గ్రామములందు సనాతనధర్మముల నాదరించువారిని సంప్రతించి

రాఁబోవు ఎన్నికలలో నట్టివారు సనాతనసంఘములు నిర్ణయించుప్రకారము తమ వోట్లవిషయములో మెలంగుటకు వాగ్దానములు పొందవలెను. ప్రతిగ్రామములోఁగల వోటర్లందఱో సనాతనపక్షమున నుండువా రెందఱో తెలిసికొనవలెను. వోట్లను గుఱించి యొట్టి నిర్బంధముగాని కూడదు. శారదాచట్టమునకై కాంగ్రెసువారు చేసిన కృషిని నాలయప్రవేశశాసనమునకొఱకై చేయఁబడు ప్రయత్నమును ప్రజలకు జ్ఞాపకము చేయుఁడు. సంస్కర్తలగు వారితో నెట్టి చర్చలును గూడవు. సనాతనులగు వారు బస్తీలనుంచి పల్లెలకుఁ బ్రచారమునకై వచ్చునప్పుడు గ్రామములందలి సనాతనులు వారికిఁ దగు సౌకర్యములను గలిగించవలెను. ప్రతి గ్రామసంఘాధ్యక్షుఁడు నొక చిన్న పుస్తకముపైఁ గాని కాగితముపైఁ గాని తమ కనుకూలమైన గ్రామస్థుల పేర్లను వ్రాసియుంచవలెను. అందుఁ బ్రచారము చేయుట కిష్టపడువారి పేర్లను బత్రికలకుఁ బంపవలెను. ఈవిధముగాఁ బ్రచారము గ్రామముల వ్యాపించునెడల శీఘ్రకాలములోఁ గాంగ్రెసునియంతలు సనాతననాయకులతో రాజీకి రాఁగలరు. సనాతనులారా! హిందూమతమునకు సంస్కర్తలేవిధముగా శాసనములద్వారమున ముప్పుగలిగించుచున్నారో తెలిసికొనుఁడు- సంఘీభావమును వహింపుఁడు- కాంగ్రెసుతో సాహాయ్యనిరాకరణము ప్రారంభింపుఁడు. శీఘ్రముగ మీ కోరికలు ఫలించును. హిందూమతము రక్షింపఁబడును. ధర్మో రక్షతి రక్షితః.

శ్రీ

—♦ సనాతనధర్మసభ ♦—

(కామేశ్వరశర్మగారు)

అఖిలభారతవర్షీయ వర్ణాశ్రమ స్వరాజ్యసంఘకార్యదర్శిగారి యాదేశానుసారము 15-5-1933 తేదీని ధర్మవిరుద్ధశాసనములను బిల్లులను బ్రోత్సహించి బలపఱచి యంగీకరింపఁజేసిన శాసనసభ్యులను సంఘసంస్కరణప్రియులను నిరసించుటకుఁ దెనాలితాలూకా వర్ణాశ్రమ స్వరాజ్యసంఘ సమావేశము తెనాలి శ్రీ హనుమాన్ చౌకులో జరిగెను. ఆసభకు మ. రా. శ్రీ బలిజేపల్లి రామకృష్ణయ్య పంతులుగారు బి. యే., బి. యల్. వకీ లధ్యక్షతవహించిరి. సభకు సుప్రసిద్ధపండితులును సనాతనధర్మ ప్రచారకులును నగు బ్రహ్మశ్రీ ఘుడియారం శివయ్య శాస్త్రులుగా రనారోగ్యముగా నుండుటచే రాఁజాలనందులకు విచారమును దెల్పుచు సభ జయప్రదముగా జరుగఁగోరుచు నాశీర్వాదముఁ బంపిరి. అత్యంతధిగా సభ జరిగినను వేఁడిగాడ్పులు విశేషముగ నున్నను బెక్కురు సమావేశమునకు విచ్చేసిరి. వారిలో మ. రా. శ్రీ అక్కరాజు గోపాలరావుగారు (రిటైర్డు మేజస్ట్రేటు) మన్నవ వెంకటరామయ్యగారు బి. యే. బి. యల్. సాహిత్యరత్న, అందుకూరి సుబ్రహ్మణ్య శాస్త్రులుగారు, పరిభల వెంకటసుబ్బయ్యగారు (రిటైర్డు రివిన్యూ ఇన్స్పెక్టరు) హనుమదాలయ ధర్మకర్త ఆర్. పిచ్చయ్యశాస్త్రులుగారు చింతలపూడి రామారావుగారు. బి. ఏ మొదలగు వా రనేకులు గలరు.

స్త్రీలుకూడఁ గొందఱు విచ్చేసిరి. సంఘకార్యదర్శియైన మ. రా. శ్రీ కోటంరాజు కృష్ణారావుగారు రాఁనాటి సమావేశమునుగుఱించి సభ్యులకుఁ జెప్పి యనంతరము ధర్మవిరుద్ధశాసనములను గుఱించి గంభీరోపన్యాసము 2 గంటలకాలము చెప్పిరి. అందు శారదాశాసనముగుఱించి చెప్పుచు స్వగృహాదుల విడిచి యూరాం మొదలగు స్థలముల జరుగు వివాహములే శారదాశాసన మసంఖ్యాకుల కనిష్టమని తెలియఁజేయుచున్నవనియు నిట్టి స్థితిలో సవరణచేయుట (చట్టము రద్దుచేయక) అధర్మమనియుఁ గ్రియిక్‌గారు చెప్పినటుల వివాహము కేవలము కంట్రాక్టు కానేరదనియు మహాదేవదేశాయిగారిచ్చిన వితంతువుల వయస్సు వారిసంఖ్య న్యాయ్యమై యుండదనియుఁ గరాచికాంగ్రెసులోఁ బ్రభుత్వమువారు మతవిషయములో జోక్యము కలుగఁజేసికో రాదని తీర్మానించియుండినను గాంగ్రెసధ్యక్షులు సుభాస్ చంద్రబోసుగారు తమ యధ్యక్షోపన్యాసములోఁ గాంగ్రెస్ మతవిషయములలోఁ దాటస్థ్యము వహించునని చెప్పియుండినను గాంగ్రెసువారు మతవిషయములలో విరుద్ధమగు శాసనముల కంగీకారముచూపుచున్నారనియు రాజకీయముగ దేశసేవ చేయుటకై యత్నింతుమని వోట్లను గైకొని మతవిరుద్ధమగు శాసనములఁ జేయుట కంగీకరించుట శోచనీయమనియుఁ గేవల మైహికసుఖములనే కోరుచు ధర్మనిర్ణయము చేయుట దేశక్షేమము కానేరదనియు దేవాలయములకు సంబంధించిన ధనమును విద్యాసంస్థల కుపయోగించుట న్యాయము కానేరదనియు మొదలగు విషయములు చెప్పుచు సనాతనులు తీవ్రమైన కృషి చేయవలెనని ముగించిరి. అనంతర మొకరు సనాతనధర్మ విరుద్ధమైన శారదాశాసనముగుఱించి కొన్ని ప్రశ్నల నడిగిరి. వానికి లక్కరాజు గోపాలరావుగారు సమాధానము చెప్పిరి. ప్రేక్షకులలో నొకరు గా॥ వి. వి. గిరిగారి కార్యదర్శిగారు "మమ్ముల వోట్లనిచ్చి పంపినవారిదే తప్పని లోఁగడఁ దెనాలిలో దేవాలయ ప్రవేశవిషయమై చెప్పిన యుపన్యాసములో నుడివి"రని యనిరి. ఇఁకనైన జాగ్రత్తపడుట మంచిదని యొకరనిరి. ఎన్నికలలో సనాతనమతమును గాపాడుదుమని ప్రమాణపత్రముపై సంతకము చేసినవారికే వోట్లనీయవలెనని కొందఱు చెప్పిరి. అనంతరము తీర్మాన మేకగ్రీవముగా నంగీకరింపఁబడెను.

—♦ బ్ర॥ శ్రీ శివయ్యశాస్త్రులుగారి యనారోగ్యము ♦—

సుప్రసిద్ధసనాతన ప్రచారకులును బండితులును నగు ఘుడియారం శివయ్యశాస్త్రులుగారికి వీఁపున శంకరజయంతినాఁడొక కురుపు బయలుదేరి పెద్ద దాయెను. శ్రీవారు తెనాలిలో నున్నారు. 14-5-38 తేదీ నాపరేషన్ జరిగెను డా॥ శివకోటీశ్వరరావుగారు చికిత్సచేయుచున్నారు. శాస్త్రులుగారు కులాసాగా నున్నారు. 15 రోజులలో సంపూర్ణముగా నారోగ్యము కలుగునని డాక్టరుగారు చెప్పుచున్నారు. శాస్త్రులుగా రీస్థితిలో నున్నను సనాతనధర్మప్రచారవిషయమై మఱి వక సనాతనులను బ్రోత్సహించుచుండుట వారికి ధర్మమందుఁ గలపట్టుదలను వెల్లడించుచున్నది. త్వరలో సంపూర్ణారోగ్యము శాస్త్రులుగారికిఁ గలుగుటకుఁ బరమేశ్వరుని బ్రార్థించుచున్నాము.

—♦ అనుభవానందము (నాగరికత) ♦—

(ప్రకృతి)

స్త్రీల నుంచుకొని నిద్రకై రాత్రింబవళ్ళు తలక్రిందుఁజేయువారును దార్ఢ్యము లేకపోయినను సైకిలుషాపువాని కద్దెనిచ్చి బండి నెరువుదీసికొని పనిపాటలు మాని పగలంతయు స్నేహితులతోఁ దిరిగి యింటివద్దఁ దిండికి లేక పస్తుండువారును నంకెలు దెలియకపోయినను బ్రశస్తమైన గడియారమునుమాత్రము తెప్పించి దానికొఱకొక యాల్పాకా కోటును గుట్టించి దర్జాగా నాకోటుజేబునకుఁ దగిలించి మురియుచుండువారును నే చిన్నగృహములోనైనను సుఖముగా వెళ్ళఁబుచ్చుకొనఁగలిగిన భార్యాభర్తలిరువురును గాఁపురమునకై చలువరాళ్ళతో విశాలమైన లోగిలిని గట్టించి దానికిఁ జాకిరిఁజేయఁజాలక యిల్లంతయుఁ గుక్కలకును గోళ్ళకును విడిచి యిద్దఱును నేమూలనో కాఁచుకొని తాఁగుచుండువారును స్థితి తక్కువైనను నప్పుఁజేసి యల్లునికి హెచ్చుగాఁ గట్నము లిచ్చి యున్నభూము లమ్ముకొని దరిద్రులగువారును నష్టకష్టములఁ బడి చదువుకొనుచుండఁగా మధ్యకాలములో గ్రహచారము తప్పి వివాహమైనచో నదిమానివేసి విద్యాఫలితముఁ జెడఁగొట్టి ముష్టిచెంబు చేతఁబట్టువారును మీటింగులయందును వివాహాది శుభకార్యములయందును ననాచారమని తలంపక మద్యమాంసాదులను దెప్పించి డాకలకు డాకలు వండించి బంధుమిత్రాదులకుఁ బంక్తులపై బహిరంగముగా వడ్డించువారును బ్రస్తుతమునం దీప్రపంచమునం దెందఱో కలరనుసంగతి చాలమంది యెఱిఁగియే యుండవచ్చును.

అంతేకాక యిప్పటికాలమునం దీనవనాగరికుల గాలిసోఁకి వారికంటియున్న కుక్కలు పిల్లులు మొదలగు నితరజీవులుగూడఁ గ్రమక్రమముగాఁ దమతమ సహజాహారములను గుర్తింపనేరక మానవనిర్మితమైన కృత్రిమాహారములనే భుజించి వివిధరోగములచేఁ గృశించి చచ్చుచుండు టంతకంతకు స్వాభావికధర్మమైనది.

విచారించి చూచినచో ననపగుగ్గిళ్ళు దిని యఱుపుకొనుటలోను జొన్నయన్నము చోడియంబలి మొదలగు కఠినాహారములను యథేచ్ఛగాఁ దిని గొప్పగొప్ప పనులు చేయుటలోను బరువులు మోయుటలోను బహుదూరము నడచుటలోను జాలకాలము జీవించుటలోను జాంద్రాయణాదివ్రతములు సలుపుటలోను బ్రహ్మచర్యవ్రతమును బాలించుటలోను మనోవాక్కాయకర్మలను సమానముగా వర్తింపఁజేయుటలోను శతాంశమైనను నిప్పటి నవనాగరికులు మనపూర్వులను బోలఁగలరా?

మనపూర్వులకును మనకునుగల వ్యత్యాసములను బరికించినచో మనము వారి సంతతివారమని జెప్పుకొనుటకుఁగాని మనస్సులోఁ దలఁచుకొనుటకుఁగాని యెంతమాత్రమును వీలులేదు. అజబ్బపుష్టి యాయెముకలపుష్టి యాసంతానపుష్టి యాతిండిపుష్టి యావీర్యపుష్టి, యిప్పటినవనాగరికుల కెవ్వరికి నున్నట్లు కలనైనను గాన్పింపదు.

అంతకంతకు నవనాగరికత బలిసినకొలఁదియు నల్పాయుష్మంతులు దీర్ఘరోగశరీరులు స్తోత్రప్రియులు నాత్మస్తుతిపరాయణులుఁ బరనిందానిరతులు నారంభశూరులు నర్థకార్యనిర్వాహకులు స్వలాభాపేక్షకులుఁ బరదారాగమనులు జీవహింస

ములుఁ దయారై నేయిలేకపోతే ముద్దగొంతుక దిగనివారు నింటఁ గూరలు సందర్భపడక యెల్లప్పుడును బంధువులను సేవించువారు సదుపాయమున కపేక్షించి పనిలేనిదే సర్వదా వంటపూటియిండ్లవద్ద భుజించువారు స్త్రీలు వండినపదార్థములు సరిపడక పలుతిండ్లకు మరగి బజాఱులోఁ బకోడీలు పెసరట్లు మొదలగునవి దెచ్చి యన్నములోఁ గలుపుకొని తినువారుఁ గృత్రిమాహారములను వేళపాళలేకుండఁ దెగమ్రింగి గడించిన రోగశాంతికొఱ కుదయమునఁ జోడియంబలి సాయంకాలమున గోమూత్రములో నౌషధములు సేవించువారు నింద్రియపుష్టికై లేహ్యములు మాజుములు తైలములు ఘృతములు గుళికలు పానీయములు మున్నగునవి తయారుజేయు నిమిత్తము వైద్యుని దెప్పించి యింటివద్ద నిరంతరముఁ గాపుర ముంచువారు, బ్రతుకు సరిలేకపోయినను డబ్బున్నదికదా యని పత్రిక నొకదానిని స్థాపించి సత్పురుషుల భావములను గమనింపనేరక చేతికివచ్చిన కృత్రిమపువ్రాఁతలు వ్రాసి యచ్చొత్తించి హాస్యాస్పదులగు వారు ననుభవములేకపోయినను బ్రపంచమునం దెల్లవిషయములుఁ దమకుఁ దెలిసినట్లుగా నుపన్యసింపుచు వ్యర్థకాలక్షేపముఁ జేయువారుఁ గవీశ్వరులమని యేవో కొన్ని విషయము లితరగ్రంథములనుండి దొంగిలించి పెద్దపెద్ద గ్రంథములువ్రాసి యానందించువారు మంచముపై నాలుగు పరుపులు పఱచి గాలిచొరని కటికచీఁకటియిండ్లలోఁ బరుండినఁగాని నిద్రపట్టనివారుఁ బరుండుగదిలోనుంచి రాత్రి బైటికి లేవలేక కాల్చిన చుట్టలతో సహిత ముమ్మిసీటిని భద్రపఱచుకొనుటకు మంచముదగ్గఱఁ బీకుదానుల నుంచువారు మూడవవివాహమాడి కాపురమునకు వచ్చిన పడుచుభార్యను సంతోషపెట్టుటకై పాలతో సహితము నల్లమందు బిగించువారుఁ బ్రక్షాళనము చేసికొనుటకుఁగూడ నోపిక లేకుండున ట్లమితముగాఁ దిని యొంగిలి చేతిని సేవకుచేఁ గడిగించుకొనువారు; శరీరము గదలుట కొప్పుకొనక భోజనపదార్థములను వంటవాండ్రచే వండించి నోటిలోఁబెట్టించుకొని దినువారు స్త్రీలు తమ సంతానమునకుఁ బాలిచ్చుట నాగరికతకు భంగమని దాసీలచేఁ బాలిప్పించువారు భగవంతుఁడుంచలేని యనవసరమైన బెజ్జములు చెవులకును ముక్కులకును బొడిపించుకొని వానికి బంగారమును రాళ్ళను దగిలించి తెగమోయువారునై ప్రపంచమునం దిప్పు డెందఱో ప్రఖ్యాతి గనుచుండిరి.

మఱియు, పూర్వ మొకజత యంగవస్త్రములతోఁ గాలక్షేపముఁ జేయువాని కిప్పుడు నాలుగు జతల మల్లుపంచెలు నాలుగు కమ్మీజులు నొక హాంటింగుకోటు నొక వేష్టుకోటు రెండు సాదాకోట్లు నొక గడియారము నొక ఫౌన్టెన్ కలము జలువజోడు బూడ్సులజోడు గూడఁ గావలసివచ్చినవి. మును పాకకూర చారు పప్పుతో భుజించు వాని కిప్పుడు నాలుగు కూరలు రెండు పులుసులు పది పచ్చళ్ళు పప్పుచారు మజ్జిగ నేయి మున్నగునవి యవసరము లైనవి. వంద రూపాయలతోఁ జేయఁగలిగిన పెండ్లి కిప్పుడు భోగముమేళము బ్యాండుమేళము గనిశెట్టిమేళము రమఢోలుమేళము సన్నాయిమేళము గ్యాస్లైట్లు బాణాసంచాలు నత్తరుదానులు వగరుపుల్లలుఁ గిల్లీచుట్టలు ముత్యాలపాలకీ యూరేగింపులుఁ బంచెలచాపుల బహు

మతులు నున్నీలడ్డు జిలేబీల నామమాత్రఫలహారములతోఁ బదివందల రూపాయలైనను జాలుటలేదు. ఉదయమునఁ దరవాణియన్నము దినుటతో సరిపోవు వానికిప్పుడు ప్రతిదినమును ఉప్మా యిడ్డెన్ పెసరట్లు నామవడలు మొదలగువానికై రొక రూపాయ ఖర్చు. దమ్మిడీ ఖర్చులేకుండఁ బదిమైళ్ళదూర మనాయాసముగా నడువఁగలిగిన వాని కిప్పుడు నాలుగుమైళ్ళ ప్రయాణమునకే గుఱ్ఱపుబండికిఁ జార్జి రూపాయనర. సొంతమోటారైనచో ఖర్చుఁజెప్పనవసరము లేదు. బండి బోర్లఁబడెనేని భాగ్యవంతుఁడైనచో రబ్బరుకాళ్ళు గాజుకన్నులుఁ గట్టించుట ప్రాప్తమగును. ఇంకను మొంగము మెఱుఁగుడబ్బీలను వాసనసబ్బులను సెంటుబుడ్లను జలలకంటింపుక త్తిరంపులతోఁ బ్రతిదినోదయ క్షౌరములకు ఖర్చెంతయగునో యెవరికెఱుక! ఇప్పుడు జీవించియున్నవారి కండ్లయెదుటనే యిన్నిమార్పులు గలిగియుండఁగా నిఁక రాఁబోవు కాలపుసంగతిని జెప్పఁదలంచుట వ్యర్థము.

ఇప్పటి నాగరికులకుఁ డిఫెన్కారియరు ట్రావిలింగుబెడ్డు సక్కీటుకాట్ కిరసనాయిల్ స్టౌ టీడబ్బీ పంచదారపాట్లము పొలటిక్ వంటమానిసి జెలయాలు గుడ్డగొడుగు గుండులాంతరు ట్రంకుపెట్టె సీమకుక్కలు పికిలిపిట్టలు తెల్లదొలుక బోనులు మొదలగు సాధనసామగ్రి లెట్టిప్రయాణమునకైనను నుండవలసినదే!

మఱియు దేహమున కారోగ్యమిచ్చి మనశ్శాంతిగలిగించునట్టి స్నానము నుపవాసము నాచారము మొదలగు సదభ్యాసము లెన్నఁటికిని మఱవకుండున ట్లోకుల కొక్కసారి ప్రకృతి ధర్మములు బోధించుటకై పుణ్యయాత్రలు గల్పించిన మన పూర్వుల సద్భావములను గుర్తింపఁజాలక శేళాకోళముగా నెంచి ప్రఖ్యాతికొఱకు సొమ్మును ఖర్చుపెట్టి కాశీగంగను గాలభైరవసూత్రములను బోష్టుద్వారమునఁ దెప్పించి యింటివద్దఁ బంచిపెట్టి సంతసించువారు కొందఱు నొకవేళఁ గర్మముచాలక యాత్రచేసినచో నచ్చటఁ బ్రస్తుతమం దభివృద్ధి వహించియున్న వ్యభిచారము దొంగతనము త్రాఁగుడు పందెము జూదము నిద్రాభంగము మాంసభోజనము ననాచారము నతిభుక్తి మున్నగు లెక్కలేని దుష్ప్రవర్తనలచే నారోగ్యభంగమై కలరా ప్లేగు మున్నగు ఘోరవ్యాధు లుత్పన్నమై వానిమూలమున సంఘుమరణములు నెందువారు కొందఱు విధిలేక కాశి మొదలగు పుణ్యక్షేత్రములు సేవింప నెంచినను బ్యాకేజీచేసిన చింతపండు బుట్టవలె రైలెక్కి వెళ్ళిన యెనిమిదవ దినమునకే యిల్లు తిరిగిచూడనిది బ్రతుకలేనివారు కొందఱునై యిట్లనేకరీతుల మానవు లీనవనాగరకతా మాహాత్మ్యమును వెల్లడించుట మన మెఱిఁగియే యున్నాము. వైఁగా నట్టి యాత్రలు చేసి వచ్చిన వారిలోఁ గొందఱు యాత్రకై ఖర్చుపడిపోయినసొమ్ము మరలఁ బ్రోగుపడు వఱకు మునుపటికంటె ధర్మశూన్యులై యెట్టి పరమనీచకార్యములనైనను జేయుచుఁ దిన్నగాఁ దిండికూడఁదినక వర్తించుచు సర్వదా మహాదుఃఖమును బొందుచుందురు.

అక్కటా! ఇప్పటి నవనాగరికులు ముడిఁబెట్టు వివాహముచేఁ గలుగు ముచ్చట లేవలేక చావునకు సిద్ధముగానున్న ముసలమ్మలకు బంధువులకుఁ బెద్దలకుఁ బేరంటాండ్రకు భజంత్రీలకుఁ దీరుచున్నది. కాని, పెండ్లి యేమిటో! దానియభి

ప్రాయ మేమిటో ! సుఖదుఃఖము లేమిటో ! తెలియని యావధూవరులను మాత్రము వెనుదుఃఖమున ముంచివేయుచున్నదనుట కేమభ్యంతర మున్నది ? మఱియు వంద సంవత్సరముల క్రిందటి మానవుఁ డెవఁడైనను దిరుగ నీప్రపంచమును జూడఁ దటస్థించినచో నిప్పటి మనుజుల జవసత్వములను హరించుచున్న యీమోటారుబండ్లు నీట్రాంబండ్లు నీ సైకిలుబండ్లు నీగుఱ్ఱపుబండ్లు నీ వంటపూటి దుకాణములు నీ కాఫీ షాపులు నీ సోడామిషనులు నీ బ్రాందికొట్లు నీ కిల్లీయండ్ కోలు పొడుము దుకాణములు మిఠాయి యంగళ్ళు డ్రామాకంపెనీలు ధాన్యపుమిల్లులు గ్యాసులైట్లు విద్యుద్దీపములు కుట్టుయంత్రములు నిస్సారపుభూములు నీరసపుఁబంటలు హెచ్చుధరలు క్రొత్తక్రొత్త రోగములు దుర్బలశరీరములు కృత్రిమరూపములు చమత్కారచర్యలు చిత్రవిచిత్రాలంకారములు నమిత సంతానములు నకాలమరణములు నౌషధ సేవనములు మున్నగు వాని విషయమై యేమిదలంచునో ! యెవరి కెఱుక. ఇట్లభివృద్ధి గాంచుచున్న నవనాగరికతను జూచి విచారించి;

"తే. గీ. అతిపరాక్రమచర్యలం ♦ దంటి పేరు
వడసి మితిలేని యిడుములఁ ♦ బడుటకంటె
శాంత మమరించి మదియందుఁ ♦ జింతఁబాసి
సుస్థిరత గాంచుటే మహా ♦ సుఖము మనస !

అని యొకరాజయోగి తన యనుభవమును వెలిఁబుచ్చియున్నాఁడు. కావున; బిడ్డలారా! ప్రకృతినిజ మెఱిఁగి తరింపుఁడు.

—♦ జ్ఞానము ♦—

మానవుని జ్ఞానము ద్వివిధము. అందొకటి ప్రకృతిని గుర్తించునదియు రెండవది బ్రహ్మమును గుర్తించునదియు నైయున్నది.

చరాచర ప్రపంచమంతయు స్థావరములనియు జంగమములనియు రెండు విధములుగా మానవులచే వ్యవహరింపఁబడుచున్నది. అందుఁగొన్ని స్థావరములు జంగమములకును గొన్ని జంగమములు స్థావరములకును నాహారము అగుచున్నవి. కాని, వ్యర్థమగుటలేదను సంగతిని గమనించి ప్రకృతి ననుసరించుటే జ్ఞానము.

లోకములో ధనము ధాన్యము బలము బంధువులు భార్య బిడ్డలు భూములు నిండ్లు పశువులు పదవులు మొదలగునవన్నియు నస్థిరములని తలంపక సర్వదా చెడఁద్రావి తెగఁదిని పోతరించి యాటపాటలయం దనురక్తులై పొంగుచు మిథ్యానందములో మునిఁగి శరీరమును ధర్మమును బ్రపంచమును మఱచియున్న మానవులయొద్దకేగి వారితోపాటజ్ఞానములో మునుఁగుట మంచిపని గాదనియును రోగులుగల చోటికిని బీనుఁగును దహించుచున్న చోటికిని జచ్చి యేడ్చుచున్న చోటికిని బోయి యాయాస్థలములలోఁ బలువురు పలురీతుల ముచ్చటించుకొను విషయములను గుర్తించి వానియథార్థమును గ్రహించుటయే శ్రేష్ఠ ధర్మమనియును జచ్చినవాఁడు గూడ నొకానొక సమయమున మనవలె సర్వకార్యములను జేయఁగలిగి యుండె

వనియును మనకున్నట్లె వానికిని బంధువులు భూములు పశువులు నిండ్లు భార్యా బిడ్డలు మున్నగునవన్నియును గలవనియును నిప్పు డవి యతనిని విడిచి చూచుచుండఁగా నితరుల పాశ్రయించినవనియును వానిలో నెంతకొద్ది భాగమునకైనను నాతఁడిఁకెప్పటికిని సొంతదారుగాని భాగస్థుఁడుగాని గానేరఁడనియును దెలిసికొని జీవశక్తి బాగుగానుండఁగానే మన బ్రహ్మాండపిండాండములయందుఁ బూర్ణమైన హక్కు గలిగి యుండఁగానే వ్యర్థవైరాగ్యపుమాటలతో నానందింపక నోటితోఁ బలుకఁ గలిగినది మనశ్శరీరములచే నొనరించుచు హింసా హింసలవలనఁ గలుగు ఫలితమును గుర్తించి యీరెండింటిచేఁగూడఁ గాలము సమముగానే జరిగిపోవుచున్నదనెడి జ్ఞానమును సంపాదించి హింసాజనితంబులగు శరీరవ్యథ మనోవికలత్వము ననారోగ్యము మొదలగు వానియొక్కయు నహింసాజనితంబులగు శరీరసౌఖ్యము మనస్థిరత్వము నారోగ్యము మొదలగు వానియొక్కయు భావములను గుర్తించి ప్రకృతిలో స్వాతంత్ర్యమునకును బరోపకారమునకును దగిన యవయవనిర్మాణములు గలిగిన జన్మఫలితమును వ్యర్థ మొనరించుకొనుటకై వివిధములైన కృత్రిమాహారవిహారములను మరిగి చెడిపోక మానవధర్మమును దెలిసికొనుటయే ముక్తియనియును నదియే ప్రకృతి సమ్మతంబైన జ్ఞానమనియును శ్మశానములో జరుగు సమాధి దహనకర్మ మొదలగు క్రియలను సర్వదా తలఁచుకొనుచు నట్టిక్రియలీకాలచక్రమునం దొక దినమున మనకుఁగూడ జరుగనై యున్నవనియును నందుచే మనకాలమును సత్యముగా జరుపుకొనుటయే శ్రేయస్కరమనియును గ్రహించి దుష్టవర్తనలను మాని మనశరీరములను శుద్ధిపఱచుకొని చరింపఁగలిగిన జ్ఞానమే ప్రకృతికిఁ బరమైన బ్రహ్మజ్ఞానము.

పూర్వజన్మ సుకర్మవలన సద్గురుకటాక్షమబ్బిన మానవునికి మొట్టమొదటఁ బ్రకృతి జ్ఞాన మలవడి దానిచే నజ్ఞానము నశించి శాశ్వతమైన బ్రహ్మజ్ఞానము సిద్ధించి మోక్షము లభించును.

లోకములో జడలు రుద్రాక్షమాలలు దండకమండలువులు బూడిదపూఁతలు సర్వాంగక్షౌరములు పావుకోళ్ళు చర్మము మాయవేషమునకుఁ దగినబొంత గంజాయిచిలుము మొదలగు వివిధపరికరములను సంపాదించి శిష్యులను జేర్చి వారి కమితమైన దురభ్యాసము లలవడఁజేసి తెలివినంతయుఁ గృత్రిమభోజనముల కొఱకును గంజాయిపత్రికొఱకును వ్యయపఱచి పలుకష్టములకు లోనై జ్ఞానిననుకొనువాఁ డొకఁడు నేదోయొక మంత్రమును శిష్యులకమ్మి కొంతధనమును సంపాదించి జ్ఞానిననుకొనువాఁడొకఁడు గురువుగారివద్ద మంచిమంత్రము తప్పక వశీకరింపునకుఁ గొనఁగలిగితినని సంతోషించి జ్ఞానిననుకొనువాఁ డొకఁడు రుద్రాక్షమాలలు శరీరమంతటఁ గట్టుకొని జ్ఞానిననుకొనువాఁడొకఁడు దేహమంతటను బంగనామము లుంచుకొని మెడనిండఁ దులసిమాలలు ధరించి జ్ఞానిననుకొనువాఁ డొకఁడు పెద్దలు సంపాదించిన మాన్యము లమ్మి యాధనసహాయముచే నేదోయొక తుచ్ఛ మత మవలంబించి కల్లు మాంసము ముండ గంజాయి మున్నగువాని కలవడి జ్ఞానిననుకొనువాఁ డొకఁడుఁ బంచకోశభక్షణయోగమని శుక్లరేతస్సులను గలిపి తీసి పంచదారతోఁ గలిపి భక్షించి సంత

సించువాఁ డొకఁడు మలమూత్రాదులను దినువాఁ డొకఁడు మనుష్య మాంసమును దినువాఁ డొకఁడుగా నిట్లనేకరీతులఁ దమ తమ యిష్టమువచ్చినట్లు సంచరించుచుఁ బ్రకృతిని మంటఁగలిపి సత్యమును మఱచిపోయి యితరులు తెలియఁజెప్పినను విన నొల్లక వినినను నాచరింప నేరక తమవాక్యములే తమ నడవడికలే తమ భావములే యథార్థములని మురిసి మురిసి మిథ్యయైన తెలివిచే నితరమతములను బూర్వపక్షములు సేయుచు నెంతఘోరమైన నైనను స్వమతోద్ధారణకై పలుపాట్లు పడుచుందురు.

మఱియు నహింసను బూని తోలుచెప్పులను దొడుగుట మానిన జ్ఞాని పావుకోళ్ళను ధరించినచో నల్పప్రాణులేవియైనను వానిక్రిందఁబడి చావవనియా! అవి ధరింపని యెడల జ్ఞానము నిల్వదనియా! చర్మముతోఁజేసిన జోళ్ళకంటె నది సౌఖ్య మిచ్చుననియా యెంచునది? అహా! జ్ఞానమున కభిలషించి లోకమునం దిట్టి మూఢాభిప్రాయములలోఁబడి ప్రకృతిధర్మ మెఱుంగక యొకరిని జూచి యొకరు హింస నహింసగా నెంచిన జోగులు స్వాములు సన్యాసులుఁ బరమహంసలు సంసారులుగూడ నెందఱో నాశనమగుచుండిరి.

—♦ తులసి యుపయోగము. ♦—

(ఆరోగ్య ప్రకాశిని)

ఈ తులసిమొక్క విష్ణుప్రీతికర మగుటచేఁ బరమపవిత్రము. దోమలను బాఱఁదోలును. పెక్కువ్యాధుల నిర్మూలించును. చలిజ్వరము జీర్ణాశయ వ్యాధులు కాలేయ వ్యాధులు మున్నగు వానికి దీని యాకులను వాడెదరు. లోహ సంబంధము గల మందుకొన్నిలను దులసి రసముతో నఱఁగఁదీసి సాకెదరు. తామర మున్నగు చర్మవ్యాధులకుఁ దులసియాకులను నూఱి నిమ్మపండురసము కలిపి పైన రాచెదరు. ఎండినయాకులను నీళ్ళలో (10 తులముల నీళ్ళ కొకతుల మాకుచొప్పున) వేసి మరిగించి యా కషాయమును రొమ్ముపడిసెము మున్నగు వానికి వాడెదరు. ఈ కషాయములోఁగొద్దిగా నేలకులపొడిని సాలామిశ్రిపొడిని గలిపి త్రాఁగినచో వీర్యవృద్ధిని గలిగించును. చెవిపోటు వచ్చినచోఁ దులసి యాకు రసమును జెవిలోఁ బిండినచోఁ దగ్గిపోవును. ప్రతిదినము నుదయమునఁ దులసియాకును నలిపి యొకతులము రసమును దీసి త్రాఁగుచున్నచో జీర్ణజ్వరములు విరేచనములు హోమొరేజి మున్నగునవి తొలఁగిపోవును. బిడ్డలకుఁ గడుపుకూల వచ్చినచో తులసియాకు రసములోఁ గొద్దిగా నల్లపురసమును గలిపి త్రాఁగించెదరు. ఒక తులము తులసిరసములోఁ బావు తులము నల్లమిరియాల రసమును గలిపి త్రాఁగించినచో జలుబుతోఁగూడిన జ్వరము విడువని జ్వరము మున్నగునవి తగ్గును. తాజారసమును ద్రాగినచో వాంతులు కట్టును. ప్రేగులలో నుండు క్రిములు నశించును. దగ్గు రొమ్ముపడిసెము మున్నగునవి కలిగినపుడు తులసిరసములోఁ దేనెను నల్లపురసమును నీరుల్లిరసమును గలిపి యిచ్చినచోఁ గఫము తెగిపడును. పాము కఱచినవారికిఁ దులసి మొక్కల తాజాయాకులను

వెన్నుల కొనలను లేత వేరులను నూఱి రసము తీసి త్రాగించెదరు. వాంతులు విరేచనములు వెళ్ళుచున్నపుడు ముఖ్యముగా బిడ్డలకుఁ దులసిగింజల నావుపాలతో నూఱి త్రాగించెదరు. ఈ రీతిగా గృహకృత్యములలో సామాన్యవ్యాధుల కన్నిఁటికిని దులసి దివ్యౌషధముగా నున్నదిగాననే జగద్రక్షకుఁడగు విష్ణువున కిది ప్రియతమమని హిందువులు నిశ్చయించిరి. ప్రాణదాయక ప్రాణరక్షక శక్తులు దీనియం దుండుటయే యిందులకు ముఖ్యకారణము.

గుంటూరుజిల్లా పల్నాడు సత్తెనపల్లి తాలూకాల
బ్రాహ్మణ గురుకులాశ్రమము

ఎట్టియథావిధి నైష్ఠిక ద్వాదశవర్ష బ్రహ్మచర్యాగ్నికార్యాది వ్రతగ్రహణపూర్వకములగు గురుకులావాసాధిగత వేదవేదాంగాద్యధ్యయనము లష్టవర్షోపనీతబ్రాహ్మణవటువులలో లోపించుటచేఁ దేజో, వర్చో, యశో, మేధా, న్నాయు, శ్శుభగ్యాదికములు సన్నగిల్లెనో తన్మూలక యజ్ఞతపోవ్రతాది స్వస్వవర్ణాశ్రమోచితతత్తద్ధర్మానుష్ఠానములు నామమాత్రావశిష్టములగుటచే మోక్షసామ్రాజ్య మగమ్యాగోచరమగుట యటుండ ధర్మార్థకామములుగూడ దూరస్థములగుటచే దుర్భిక్షాదికప్రాణ్యుపద్రవములు మెండయ్యెనో యేతదుపద్రవముల మూలమునఁ బారస్పరిక ప్రజాకలహములు నిరంతరాశాంతియు, గురు, దేవతా, బ్రాహ్మణ, స్వమత, ధర్మ విద్వేషములు మున్నగు స్వస్థానర్థసూచకధూమకేతువులు సర్వత్ర పొడసూపుచుండెనో. శిరస్సు లేనికబంధము కబంధము లేనిశిరస్సు ప్రాణము లేని కళేబరములభంగి వేదము లేని శాస్త్రము, శాస్త్రము లేనివేదము, పూర్వోక్తయథావిధి బ్రహ్మచర్యాదివ్రతములు లేని వేదశాస్త్రములు గూడ నచ్చటచ్చట విప్రవర్యులకడ విరళములుగ నుండియుఁ బూర్వోక్తధూమకేతువులఁ బొలియింపఁజాలక నిష్ప్రయోజనము లగుచుండెనో, పరమపవిత్రస్వస్వధర్మానుష్ఠానగంధశూన్యులును, శైశవానధిగతసర్వసమరసవైదికధర్మరహస్యవిజ్ఞానవిరహితు లగుటయేకాక యాబాల్యాభ్యస్తాపాతరమణీయమతాంతరవాసనావాసితాంతరంగులు నగుకొందఱు భారతీయులే, బ్రహ్మసమాజ దివ్యజ్ఞానసమాజార్యసమాజాది నామమాత్రరమణీయస్వకపోలకల్పిత వివిధవర్ణసంకరసంస్థలలోఁ దాము ప్రవేశించుటేకాక, కృత్తలాంగూలగోమాయున్యాయముగ ననేక భారతీయులచేఁ బ్రాణాధికములుగ విశ్వసింపఁబడుచున్న సనాతన వైదికధర్మసిద్ధాంత ప్రధానసూత్రములకే ప్రభుశాసనాదిరూపములచేఁ గూడఁ బ్రత్యక్షాఘాతములఁ గలిగింప వీలయ్యెనో సర్వవర్ణాశ్రమి ప్రజామహావృక్షమునకుఁ గూకటివేరుగానున్న బ్రాహ్మణజాతియొక్క యట్టిలోపములను దన్మూలక సర్వజాతీయ శాఖోపశాఖాలోపములను దదపరిహార్యములుగఁ దటస్థించినట్టియు దటస్థింపనున్నట్టియు వివిధమహానర్థముల సమయింపఁ జేసి సర్వప్రాణులకు సర్వవిధైహికాముష్మిక శ్రేయస్సుల సమకూర్చుటకుఁ బైనఁ జేర్కొనఁబడినట్టి బ్రాహ్మణవటువుల వేదవేదాంగాధ్యయనస్థానము సార్థవిద్యోజ్జీవకము నగుగురుకులాశ్రమము

నొకదానిని బల్నాడు సత్తెనపల్లి తాలూకాలలో ముందు స్థాపించి యేతదాదర్శకముగఁ దత్తత్ప్రాంతములలో నిట్టి యాశ్రమముల నెలకొల్పఁ బ్రోత్సాహము సేయుచు నిట్లే క్రమముగ నాసేతుశీతాచలము నిట్టిసంస్థల ననంతములుగ స్థాపింపఁ జేసి ఖండాంతరాసాధారణమగు ప్రాచీనభరతఖండ వైదిక ధర్మసౌభాగ్యమును దిరిగి ప్రతిష్ఠించుటయే యీ సంస్థయొక్క ముఖ్యోద్దేశము.

కార్యస్థానము - ఓంకారమందిరము [చౌటపాపాయపాలెము] } ముదిగొండ వేంకటరామశాస్త్రి, సర్వోపద్రష్ట.

ఈబ్రాహ్మణగురుకులాశ్రమనిబంధనావళిలోని ముఖ్యాంశములు.

1. ఈ యాశ్రమములోఁ బల్నాడు సత్తెనపల్లి తాలూకాలలోని యష్టవర్షోపనీత బ్రాహ్మణవటువులుమాత్రమే యథావిధిబ్రహ్మచర్యనియమములతో 12 సంవత్సరములు (20 సంవత్సరముల ప్రాయము వఱకు) విద్యనభ్యసింప ముఖ్యవిద్యార్థులుగఁ బరిగణింపఁబడుదురు.

2. వేదము, ధర్మశాస్త్రానుగతము నిత్యవ్యవహారార్హమునగు సంస్కృతసాహిత్యము, జ్యోతిశ్శాస్త్రజ్ఞాన పూర్వక షోడశకర్మవిజ్ఞానముఁ, దర్క-వ్యాకరణమీమాంసా యోగ వేదాంతప్రకరణజ్ఞానము యథాకాలముగ 12 వత్సరములలో నిందధిగమింపనగును.

3. విద్యార్థుల కన్నవస్త్రపుస్తకాది సర్వబాధ్యతల నీసంస్థయే వహించును.

4. ముఖ్యసంబంధులవలనఁ గ్రమమైనప్రవేశాంగీకారపత్రములు దీసికొని నియతకాలపర్యంతము యోగ్యతల గమనించియే యిందు విద్యార్థులు నిర్ణయించుకొనఁబడుదురు.

5. పర్యవసానములోఁ దత్తద్వేదశాస్త్ర విజ్ఞానమునకు స్వధర్మానుష్ఠానమునకు నిందు సమప్రాధాన్యముండును.

6. ఉపాధ్యాయులుగూడ నిందలిప్రధానోద్దేశ్యములతో సంపూర్ణముగ నేకీభవించి యీ యాశ్రమములోని పదార్థములఁ దమతమగృహములయందువలె స్వాతంత్ర్యాభిమానములతో వాడుకొనుచు ననియతోచితవార్షికపారితోషికాత్మక విధివిహితగురుదక్షిణలతో నానందించుచు సుతనిర్విశేషముగ విద్యార్థులఁ జూచుకొని యీ సంస్థ తమదిగా విశ్వసించెడి స్వధర్మానుష్ఠాత లగుశ్రోత్రియ బ్రాహ్మణులుగ నుందురు.

7. ఈ సంస్థ రు 2116-0-0 లు, నంతకు హెచ్చుగను. రు 1116-0-0 లు, రు516-0-0 లు, రు 258-0-0 లు, రు 116-0-0 లు, నంతకులోపుగ రు 16-0-0 ల వఱకు మూలద్రవ్యము నొసంగినబ్రాహ్మణులు మాత్రమే తత్తత్కక్ష్యలలో సభ్యులుగా నుందురు. ఈమూల ధనముపై వచ్చెడి యాదాయమును వ్యయపఱచవలసినదేకాని మూలమునుండి వ్యయపఱచుటకుఁగాని ఋణము సేయుటకుఁగాని యిం

దలియార్ష విద్యావిధానము నేమాత్రమైన మార్చుటకుఁగాని యెవరికి నెన్నఁటికి నట్టియధికారము లేదు. రు 16-0-0 లకుఁ దక్కువగా నొసంగినవిరాళములు తాత్కాలికముగ వాడవచ్చును. పైసద్భావముతో నొసంగిన బ్రాహ్మణేతరుల విత్తమునుగూడఁ బైవిధముగ నిందుఁ జేర్చుకొందురు. వారి కిందుఁ దత్తద్విరాళ దాతృపద ముండును.

8. ఇందు విద్యావిధానమును నిర్ణయించుట కొకపండిత పరిషత్తుండును. కార్యక్రమమును నడపుటకుఁ బైసభ్యులలోనుండి యొక కార్యనిర్వాహకవర్గము 26-1-37 తేదీన యేర్పడినది. తద్ద్వారమున సర్వోపద్రష్టసలహాలతో సర్వకార్యక్రమములు నడచుచుండును.

9. ఇప్పటి కీయాశ్రమమునకు 29 మంది సభ్యులచే రు 1116లు మొదలు, రు116-0-0ల వఱకు వాగ్దానమొసంగఁబడిన మొత్తము రు 15090-0-0 లు మాత్రమైయున్నది,

10. ఈ సంస్థ పట్టణములవాసనలు పనికిరానట్టిదియు, నిరుపద్రవ మగు పల్లెటూరి ప్రాంతములలో నుండవలసినట్టిదియు, నగుటచేఁ బ్రస్తుతము ఓంకారమందిర ప్రధానకార్యస్థానప్రాంతమున (చౌటపాపాయపాలెమున) ప్రారంభింపఁబడునట్లు నిర్ణీతమైనది.

☞ ఈ సంస్థలకు వలయు సలహాల నొసంగుట కాస్తికమహాశయులఁ బ్రార్థించుచున్నాఁడ.

సర్వోపద్రష్ట.

దాసశబ్దార్థ విచారము

బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు తమ నామాంతమున స్వధర్మమును దెలుపు శర్మ వర్మ గుప్త దాస శబ్దములను వరుసగా వాడుకొనుట యనాదిసిద్ధమగు సనాతనాచారముగ నున్నది. దాసశబ్దమునకు వేదమునందుఁ గల యర్థమేమో స్మృతులు చెప్పుచున్న యర్థమేమో నిఘంటురాజము లేమి చెప్పుచున్నవో లోకాచారమెట్లున్నదో శూద్రకమలాకరాది నిబంధనగ్రంథము లెట్లు చెప్పుచున్నవో సుస్పష్టము. దాస, శబ్దము తురీయజన్మనకును గర్షకునకును శూద్ర అను నర్థమున వాడఁబడినట్లు నిరూఢము. విశిష్టాద్వైతమున భాగవతులకందఱకు నీదాసశబ్దము భగవద్భక్తున కొక చిహ్నముగ నుపయుక్తము. నిజముగఁ బామరులు చేయు నపార్థమే యన్వయించునెడల రామానుజాది భాగవతు లందఱు నీ నింద్యార్థమునకు గుఱియగుటయేకాక యీశబ్దగ్రహణమున వారియవివేకముగూడ వ్యక్తమగును. కావున నింకనయిన దాసశబ్దము విపరీతార్థములవాతఁబడి భ్రష్టము కాకుండుఁగాతమని నమ్ముచున్నాము. దాసశబ్దమునకు లంజకొడుకను నర్థము చెప్పుట మిక్కిలి యసమంజసమై యున్నది సరికదా లేనియర్థమును గల్పింపఁజూచుటవలన ననర్థదాయకమై యున్నది. (ఆర్యప్రభ)

సీ. కడుపునొప్పియటంచు నడుగిడనేరక
పుడమిపైఁబడి చాలఁ బొరలువారు
శైలతుల్యంబులై జఠరముల్ చూపట్టె
ఇఁక నేటిబ్రదుకని యేడ్చువారు
ఇయ్యాశ్రమంబున కేలవచ్చితిమంచు
వెడవెడ నూర్పులు విడుచువారు
కారణం బేమియుఁ గానరాకున్నది
మన పూర్వకృతమని వనరువారు
అగుచు నీరీతి సకలసైన్యములు నచట
(ఒకటఁ బడియుండుటయుఁ గొంద ఱుర్వి)ధవున
కేర్పడఁగఁ జెప్ప. రాతఁ డహీనధీర
మానసుండయ్యు దురవస్థ మాన్పలేక. 14

వ. తనకును దద్దురవస్థ ప్రాప్తంబగుట కాశ్చర్యపడి భయకంపితపుల
కాంకిత తనుండై కారణం బేమొకోయని చింతించి తనలోన 15

సీ. గంధేభబృందముల్ కవిసి యియ్యాశ్రమ
ద్రుమశాఖ లిలఁ బడఁద్రోసినవియొ?
ఖురఘట్టనోద్భూత గురు రజం బెగయంగ
కాననం బశ్వముల్ గలఁచినవియొ?
రథనేమిజాతోగ్రరావముల్ మౌనీంద్ర
జపతపోవిఘ్నంబు సలిపినవియొ?
భటకదంబంబె తాఁ గుటిల(భావంబున
ఋషిగణంబులను బాధిం)చినదియొ?
లేకయుండిన నాకును మూఁకలకును
ఇట్టి దురవస్థ ప్రాప్తింప నేమిహేతు?
వనుచుఁ జింతించి మరల ధైర్యమున బలము
కలయఁ గనుగొని యిట్టులఁబలికె నపుడు. 16

తే. గీ. ఓభటోత్తములార! మీ రుగ్రులగుచు
ఘనతపోధనవాసయోగ్యంబు నిఖిల

దోషహారమును నగు (నిందు దోష మేమి
చేసినారలో) చెప్పుఁడు. చెప్పరేని. 17

కం. మిమ్మందఱ నొక్కుమ్మడిఁ జిమ్మెదు మద్ఘోరవిశిఖశిఖతతిఁబడనం
చమ్మనుజేంద్రుఁడు పల్కుడు పిమ్మటచే వారలపుడు పృథివీపతితోన్. 18

కం. అయ్యా! ఏయపరాధం
(బియ్యెడ నొనరించియెఱుఁగ మే. మిందుల కా
దయ్యంబె సాక్షియని మఱి)
కుయ్యో మొఱ్ఱోయటంచుఁ గూయిడుచుండన్. 19

వ. వ్యాకులితమానసుండై 20

మ. అకటా! కారణ మేమియుం దెలియ. (దీయాపత్తు ప్రాప్తింప) నే
మికతం? బెట్టులఁగల్గెనో యెఱుఁగరామిం జేసి మత్స్వాంతముల్
వికలంబయ్యెడు. ఏమిసేతు? ఇపు డీపీడం దొలంగించి నీ
వికఁ మాదుర్దశ మాన్చి ప్రోవఁగదవే యీశా! జగద్రక్షకా! 21

దండకము॥ అంభోధిపుత్రీ స్తనద్వంద్వసంలిప్త కాశ్మీరకస్తూరికాగంధసారాంకితస్ఫారశృంగారవక్షా! సురాధ్యక్ష! రక్షోవరానీకశిక్షా! జగద్రక్ష! దాక్షాయణీనాయకాబ్జాసనాఖండలాదిత్యముఖ్యామరవ్రాతమూర్ధాంచితాష్టాపదానూనరత్నస్ఫురద్దివ్యకోటీరకోటీరతోదారపాదాంబుజా! నారదాగస్త్య కౌండిన్య మాండవ్య శాండిల్య కాత్యాయన వ్యాస కణ్వాత్రి గాధేయ వాసిష్ఠ మైత్రేయ జాబాలి ముఖ్యర్షి ప్రస్తూయమానా! హృషీకేశ! నారాయణా! వాసుదేవా! ముకుందాచ్యుతోపేంద్ర! పీతాంబరా! పుండరీకాక్ష! గోవింద! తార్క్ష్యధ్వజా! దేవకీనందనా! శౌరి! దైత్యాటవీ వీతిహోత్రా! మహాఘోరపాపాటవీజాలచైత్రా! స్ఫురచ్ఛంఖకౌమోదకీచక్రఖడ్గాదిశస్త్రాయుధోదగ్రహస్తా! మహైశ్వర్యసంధాయకా! దేవదేవా! జగజ్జాలనిర్మాణ సంరక్షణాహారకేళిన్ విజృంభించి వర్తించు నిన్నెప్పుడున్ మల్లికాకుందమందారపున్నాగచామంతికాచంపకా ద్యర్హ దివ్యప్రసూనంబులం బూజ గావించుమర్త్యాళికిన్ మందిరద్వారసీమన్ హయానేకపాందోళికాస్యందనంబుల్ సుదీర్ఘాయురారోగ్యపుత్రార్థముఖ్యంబులుం

గూర్తు. వాకాశవాతాదిభూతంబులున్ సోమసూర్యాది భాస్వద్గ్రహానీ
కమున్ జంగమస్థావరాది ప్రపంచంబునున్ నీవయై యుందు వోదీన
మందార! పూర్వంబునన్ నీవు వైసారిణాకారముం బూని సాధో
నిధిం జొచ్చి యాసోమకున్ ద్రచ్చి యామ్నాయముల్ (తెచ్చి
వాగ్జాని కర్పింప)వా? సర్వగీర్వాణులుం బూర్వగీర్వాణులున్ క్షీర
వారాశినిం (ద్రచ్చుచోఁ గచ్ఛపాకారముం దాల్చి యా మందరాగం
బునుం బృష్ఠభాగంబునం బూనవా? సర్వసర్వంసహామండలిం గొంచు
ద(ర్వారమైనట్టి) దోర్గర్వమొప్పంగ దర్వీకరాధీశ్వరాగారముం జేరు
చామీకరాక్షుం గ్రితుస్త్రబ్ధరోమాకృతిం బట్టి నిర్వాణమొందింపవా?
పట్టినిం బట్టి కట్టల్కగిట్టింప దట్టించు దుష్టాసురున్ నట్టుకంబంబునం
బుట్టి సంవర్తకాలానలాభీలజాజ్వల్యమానాక్షులున్ భూనభోవ్యాప్త
జిహ్వోగ్రవక్త్రంబునుం గోటిసూర్యప్రభాభాసమానంబు శోభిల్ల శ్రీమ
న్నృసింహాకృతిం(జీల్చి చెండా)డవా? కర్కశత్వంబునన్ విక్రమం
(బేర్పడన్ లోకముల్ మూడునున్) మూడుపాదంబులన్ విస్మయం
బొప్ప నాఁకట్టి యా శుక్రశిష్యుం గడున్ ఖర్వరూపంబునం గ్రింది
కిం (ద్రొక్కవా? భీకరంబౌ కుఠారంబుఁ జేఁబూని ముయ్యేడుమారుల్
ధరానాయకానీకమున్ వీఁకఁ బోకార్పవా? శం(కరాదుల్ ప్రశం
సిం)ప నంభోధి శుంభత్ప్లవంగావళుల్ గొల్వఁగాసంభ్రమంబొప్పఁగా
దాఁటి దోస్స్తంభసంరంభ మాస్ఫాలనాభీలగంభీర రావంబులుం గుం
భినీ మండలంబెల్ల నల్లాడఁగా డింభులౌ కుంభకర్ణాదులం ద్రుంపవా?
గో(పబాలాకృతిం) బూని క్రోధంబునన్ సాధుపాళిన్ నిరోధించి
బాధించు దైత్యాళి శోధించి భేదింపవా? (హింసకవ్రాతమున్ దూరి
జ్ఞానంబు బోధించి సత్పద్యస్థాపిం)పవా? మండలాగ్రంబుఁ జేఁబూని
(గుఱ్ఱంబుపై) నెక్కి యుద్దండ (మా మ్లేచ్ఛతండంబునుం) జెండవా?
నిన్ను భూషింప భాషాదులున్ నేర. నేనెంతవాఁడన్? మహామూ
ఢుఁడన్. జ్ఞానహీనుండ. మత్తుండ. నన్నుం గటాక్షించి యీ వంతలం
బాపి యావంతయేనిం గొఱంతన్ మనంబందునం గల్గఁగానీక
రక్షింపు మోసచ్చిదానందమూర్తీ! హతార్తీ! సుకీర్తీ! కృపాస్ఫూర్తీ!
యోగీంద్రహృత్పద్మవర్తీ! నమో దేవతాచక్రవర్తీ! నమస్తే నమస్తే నమః.

వ. అని యిట్లు రాజచంద్రుండు పలువిధంబుల విలపించుచుండ నా రుధిరం బంతకంత కగ్గలంబై తద్బలంబును దన్ను నాక్రమింప దిగ్గన పెగ్గడల డగ్గఱి భూతభవిష్యద్వర్తమాన జ్ఞానసంపన్నుల రగు మీకుఁదెలియరాని వృత్తాంతంబు లెందును లేవు; కావున నిట్టి విపరీతంబు పుట్టుటకుఁ గతం బెద్దియో వెదకుం డన వార లనేకగతుల నెమకి తత్కారణం బభేద్యంబగుటయుఁ జేయునది లేక నిశ్చేష్టితులై మ్రాన్పడి చూచుచుండి రాసమయంబున. 23

— ♦ సూర్యాస్తమయ వర్ణనము ♦ —

కం. అనఘుఁడు మద్వంశజుఁడగు
మనుజేంద్రుఁడు దుఃఖ (వార్ధిమగ్నుం) డయ్యెన్
వినువీధి నుండఁజన దీఁక
ననుగతి భానుండు పశ్చిమాంబుధి వ్రాలెన్. 24

కం. ఎక్కుడువీర్యంబున శర మెక్కిడి మందేహతనువు లినుఁ డుగ్రుండై
వ్రక్కలుగఁ జేయ రుధిరము గ్రక్కెనొనా సంజకెంపు రంజిలె నంతన్

తే. గీ. అపరదిక్శైలశృంగవిహారుఁడైన
తరణిహరిఁగని భీతిచేఁ దద్గుహాళి
నుండి వెడలిన గజపంక్తియో యనంగ
(చీఁకటుల్ మూఁగె వే దిశానీకమందు) 26

వ. అప్పుడు 27

సీ. చోరసమూహముల్ మీఱి యెక్కుమ్మడి
ధనికగేహములకు దాడివెట్ట
భూరి నిశాటు లద్భుతవిక్రమాటోపు
లై త్రిదశాళిపై నరుగుదేర
కులటలు చపలత గుమిగూడి బోజుఁగుల
వెదకుచు వీధులవెంటఁ దిరుగ
పల్లవుల్ కపురంపుబాగాలు గొని పణ్య
తరుణీగృహములకుఁ దరలుచుండ

తెంతలు చేసినాఁడొ వచియించెడి వేంకటరాముఁ డుండుచో.
ఎంతయుఁ గూర్చు నగుర్విఁ డతఁ డీతని. కన్యుఁడుగాఁడుచూడఁగన్

ఉ. ఈమెయి నస్మదర్థమును నీక హరించుచునున్నయట్టి యా
ఆమబుభుక్షు వాఁడె చెడె నంచు సహించి పయిన్ సహాయులై
ఏము చరించుచుండఁ దలకెక్కెను గన్నులు. దానఁజేసియే
ఆమున నస్మదగ్రజుని యాజ్ఞల మీఱెను. చేరె వైరులన్.

ఉ. చేరినకారణంబుననె జ్యేష్ఠున కీక భుజించుభాగమున్
కోరుటువారిద్వారమున గూబలు మెల్చి యొసంగఁ జేసె నీ
ధీరుఁడు వానిచేత. తగఁ దెల్పె స్వపౌరుష. మిద్ది యొక్కలె
క్కా? రణశూరుఁ డీతఁడు. జితాహితవారుఁడు నత్యుదారుఁడున్.

ఉ. బ్రిద్దలుచేసి మిద్దె సగభాగము సుబ్బయ కిచ్చినాఁడు. పే
రొద్దిక నేరిమిద్దెలనొ యుండి తపింపఁగఁ జేసినాఁడు. ఏ
పద్దులొ వ్రాసి యెంతయును వడ్డిని బెంచి దరిద్రులన్ మహా
పద్దశ ముంచుకార్యమున భంగము గూర్చినవాఁడు వానికిన్.

ఇట్లు చినప్పయ్య వ్యాజ్యమునఁగూడఁ జివరకు జయమే కాంచెను. కాని వాఁడు కోర్టునొద్ద నేడ్చిన, నస్మద్భ్రాత యాత్మీయగృహమున కరుదెంచి యైనవ్యయము లెక్క చూచుకొని యాపని చేసెను. పదిపండ్రెండువత్సరముల కలుకుఁ బరిష్కరింపఁబడని పాడుతగ వగుటఁ బదునెనిమిదివందల రూపాయల ఖర్చు భ్రాత భరియించెను. పైవఁ బంచెవేసికొని బయలుదేఱుటయే సుబ్బయ్యపని. ఆయన బత్తెఖర్చులు మార్గవ్యయములదగ్గఱనుంచి యన్నియే భరించెను.

మఱియు వ్యాజ్యమున జయించినను జిల్లరవిషయములలోఁ జినప్పయ్యచేతనే యన్న జితుఁడయ్యెను. తనమీఁద వ్యాజ్యము వేయించినది మొదలు చినప్పయ్య శ్రేయస్కరకార్య మెదియుఁ జేసికొనఁ జేతఁగాక చెట్టచేఁతలకు దిగెను. భ్రాతపంట గూళ్ళు భస్మము చేసెను. చొప్పకుప్పలకు నిప్పుపెట్టెను. తురగముల దూరప్రదేశములకుఁ దోలించెను. ఒంటరిగానున్నప్పు డింటిమీఁది కేగి యంటరానివాండ్రవోలె నల్లరిచేసెను. అగుపడినచోట నెల్ల నబల ననరానిమాట లనియెను. ఇట్లు కలుఁగు లోని యెలుకవలెఁ గానరాక కొన్నియుఁ గానవచ్చి కొన్నియుఁ గావించెను. సహచరు లొప్పుకొనమిని జరుపుటకు శక్యముకాకపోయెనుగాని చంపించుటకుఁ గూడ సమాలోచించెను. భ్రాత బహిర్గతములకుఁ బ్రతిక్రియ పచరించినను రహఃకృతముల కహోరాత్రములు నంగలార్చెను. అద్రిధీరుఁడయ్యు నాచరితవ్య మాలోచింపలేక యలమటించెను. చివరకుఁ జినప్పయ్య వ్యవహారమే యస్మద్భ్రాత

యార్థికదుస్స్థితి కంఠగతమయ్యెను. వ్యవహారమువలనైన వ్యయ మష్టాదశశతరూప్యములు. అం దాయనకుఁ దిరిగివచ్చినవి యైదువంద లింటిక్రయము.

—♦ అఱువదవ పరువడి ♦—

ఆసందర్భముననే యన్న కఱువదియవ పరువడికూడ నరుదెంచెను. ఆత్మజులు గూడ నైదుగురైరి. వారి చదువుసంధ్యలకును జాల ఖర్చుపెట్టవలసివచ్చెను. ఆంగ్లేయవిద్య నభ్యసింపించెను. నరసరావుపేట యిరవుచేసెను. తత్తనూజపోషణకై తన మఱఁదలి నటనుంచెను. కుటుంబములు రెండయ్యెను. కుటుంబద్వయమునకును గోరిన కోర్కులు దీర్చుచు నక్కడకు నిక్కడకు నన్న పరిభ్రమించెను. కొడుకులకు వడుగులు పెండ్లిండ్లు నడపవలసెను. అన్నివిధముల వ్యయ మధికమయ్యెను. ఆదాయ మల్పమయ్యెనని వ్యవసాయము సాఁగించెను. అందున నిందున నార్థికదుస్స్థితి యగ్గలమయ్యెను. ఋణములు చేయఁగడఁగెను. అందులకుఁ గొంత సహాయమగునని కో, ఆపరేటీవుసంఘమును గొనితెచ్చెను. తదధ్యక్షుఁడుగూడఁ దానే యయ్యెను. తద్దయుం బొద్దు దాని నడపెను. ఆం దాత్మీయబాధ్యతతోఁ దీసికొన్నది యపర్యాప్తమగుట నన్యుల పేరుపెట్టికూడ నప్పు తీసెను. అది బహిర్గతముగా నధికారు లొత్తిడిచేయుటయుఁ దదృణభారము తనమీఁద వేసికొనియెను. అదియు నిదియుఁ దీర్ప నలవిగాక గోడు గుడుచుచునే కొడుకులకు వడుగులు చేసెను. ఇరువురకుఁ బరిణయములును బచరించెను. ప్రవేశపరీక్ష ప్యాసు చేయించెను. గాంభీర్యము చెడకుండఁ గంపంత కుటుంబభారమును భరించెను. ఇవిగాక యింకను నేవో వ్యవహారములు మీఁద వేసికొనియెను. దశ దిరిగిపోవుటచేఁ దద్వ్యవహారము లెదురుతిరుగ మొదలిడెను. ఎదురు తిరిగిన జానపాటి శేషయ్యవ్యాజ్యము మొదలైన వానిలో సంకటపడియుండియు మరల మంజులుసాహెబు వ్యాజ్య మొకటి కొనితెచ్చుకొనియెను. అదియే యంత్యమున కాయన నగచాట్లలో ముంచినది. ఆయననే కాదు, ఆయన యాత్మజులను, ఆత్మజులనే కాదు, అనుజుఁడనైన నన్ను నాపద పాలుచేసినది. అదియు నన్న కో, ఆపరేటీవుసంఘములోఁ గొన్న ఋణమునే కొన కాయన వ్యవహారరయై వయఃకాలమం దార్జించిన పదిపదునేను వేలరూపాయల యాస్తికిని భంగము గూర్చినవి. కాని యాయనమాత్ర మాయాపద చూచిపోలేదు. ఓటిపలుకు పలికినను నొక్కఋణదాతకూడ నీయన కొత్తిడి చేయలేదు. ఇంటను బైటను నీయన జీవితాంతముఁ దనదశ సింహస్వప్నముగనే చెల్లించుకొనియెను.

ఇట్టిచిక్కులకు లోనైనను మొదటినుండియు లౌకికుఁడైనను బ్రాతస్స్నానము విడఁగొట్టఁడు. సంధ్యావందన బ్రహ్మయజ్ఞ పితృతర్పణ శివపంచాక్షరజపముల సంత్యజింపఁడు. అతిథ్యభ్యాగతుల ననాదరింపఁడు. చుట్టపక్కములఁ జూచిచూడన ట్లుండఁడు. ఇట్లు వ్యాజ్యములనుండియే యైన స్వార్జితమును మరల వ్యాజ్యములకును గుటుంబభరణమునకునే కాక హవ్యకవ్యములకును దానధర్మములకుఁగూడ ఖర్చుపెట్టి మర్యాదగల కుటుంబికుఁడుగా మనఁగలిగెను గాని పిల్లికి బిచ్చము పెట్ట

యుండ మూఁడుముళ్ళువేసి గట్టిగా మూటగట్టినవాఁడు కాఁడు. ఇద్దఱుముగ్గురైనను నింటికి వచ్చినయితరబ్రాహ్మణుల నిం దొకరో యిరువురో యింకొకచోటికిఁ బొండని యనియెఱుఁగఁడు. అట్లవసానమున సంభవించిన లేమిడి యంతగా నభివ్యక్తము గాకుండ సర్వా గౌరవముతో వర్తించుచు నఱువదియొక్క సంవత్సరముల కన్న యశశ్శేషుఁడయ్యెను. మంచములోనే మలమూత్రములు విడువవలసిన కొంచెపు స్థితికి లోనుగాక నీరువట్టిన దేహముతో నెలయో రెండునెలలో నెట్టివేసి మాటలాడుచు మాటలాడుచునే మరణించెను. మరణము సమీపించినది మొదలు తరుణీసుతాదులే కాక తమ్ముఁడనైన నేను దగ్గఱనుండి తగునుపచారము లొనరించితిమి కాని ప్రాణములు పోవువఱకు నాసన్నపతివియోగాకులచిత్తయగు భార్యయైనను బరిదేవనము చేయుటకు భయపడియెను. అట్టిచండశాసనుఁడు

ఆ. వె. ప్రభవ పుష్యశుక్లపక్షంపు ద్వాదశీ (4-1-1928)
తిథిని విధినియుక్తి దివముఁ జేరె.
హరికి భక్తుఁడగుచు హా! హరిత్రయమందె
హరిని గలసె నన్న దగ్రజుండు.

మ. హిమవద్ధైర్యుఁ డవార్యశౌర్యుఁడు కబంధేశానగాంభీర్యుఁ డం
బుముగౌదార్యుఁ డహీనవీర్యుఁడయిమత్పూతాన్వవాయంబు ఖ్యా
తము గావించిన మేటి నిర్జిత సపత్నవ్యూహుఁ డజ్ఞాత దై
న్యముఖుఁ డుదగ్రగుణుండు వీడెఁ దనువుల్ నాయన్న నాఁ డక్కటా!

—♦ తత్పత్ని ♦—

ఈకె ప్రథమభార్య. పేరు సుబ్బమ్మ. గుంటూరుజిల్లా వినుకొండతాలూకా యోబనపాలెము గ్రామనివాసియగు రంగావఝ్ఝుల హనుమయ్యగారి కొమార్తె. కాని మాతండ్రితాత సహోదరుని పౌత్రి దౌహిత్రియై తఱచు జానపాటిలోనే పెరిఁగినది. మాతామహీ మాతామహులే కాక మాతగూడ మరణించుటచే బాలవిధవయై మొదటినుండియుఁ బుట్టింటనే యుండుచున్న పెత్తల్లి మేళ్ళచెరువు లక్ష్మిదేవమ్మచేఁ బెంపఁబడినది. లక్ష్మిదేవమ్మ తండ్రికిఁ దానుదప్ప స్త్రీపురుషసంతానమంతయు నంతమొందిన కతమునఁ దదార్జితమునకు వారసుదారై వర్తించుచునీ చెల్లెలిబిడ్డకే చెందఁజేయ నిశ్చయించుకొని యీయన కిచ్చి వివాహము చేసెను. ఎక్కువప్రేమ చూపించుచు వచ్చెనుగాని వైవాహికమైన వత్సరమునకే పది సం॥ యీడుననే భ్రాత యీప్రథమపత్ని పరలోకమున కరిగినది.

—♦ తదనంతరపత్ని ♦—

ఈమెపేరు హనుమాయమ్మ. నెల్లూరుజిల్లా దరిసితాలూకా గంగవరగ్రామము కాఁపురముగానుండిన యేలేశ్వరము రామయ్యగారీయమ జనకుఁడు. 27 సంవత్సరము లీమె కాంతునితోఁ గాఁపురముచేసి యెనమండ్రుగురు కొడుకులను నొక్క పుత్రికను గన్నది. కాని పుత్రత్రయము పురిటిలోను శరత్తునకును బరలోకమును బ్రాపించెను. కుమారపంచకమును గుమారియుఁ బెండ్లిపేరంటములు చేయఁబడి పేర్కొనఁబడుచున్నవారు. సుకృతము భర్త పరమపదించినను గొడుకులు గోడండ్రతో గొప్పయదృష్టవంతురాలై కొమరారుచున్నయది. ప్రాగుక్తగుణగణుఁడగు భర్తతో బహుకాలము ప్రవర్తిల్లుటచే నాయమకును నతిథ్యభ్యాగతుల నాదరించుట లోనగు ననేకార్హగుణము లలవడినవి.

—♦ తత్పుత్రులు ♦—

ఆంజనేయులు.

వీఁడే యస్మద్భర్త కగ్రసుతుఁడు. క్రోధి సం॥ర అధికజ్యేష్ఠబహుళ ద్వితీయ (31-5-1904) వీని జననము. భర్త వీనికి జ్యేష్ఠభ్రాతృ స్మారకచిహ్నముగా నాయనపేరు పెట్టుకొనియెను. బడిచదువు వచ్చిన పదపడి పదిపండ్రెండేండ్ల యీడు నుండి నరసారావుపేటలో నుంచి యింగ్లీషు చెప్పించెను. స్కూలుఫైనలు ప్యాసై యాంజనేయుఁ డా నరసారావుపేటలోనే షుమారు 10 వత్సరములనుండి మునిసిపలాఫీసులో గుమాస్తాగా నుండియున్నవాఁడు.

జనకుఁడు స్వర్గతుఁ డగు నాఁటికిఁ జతుర్వింశతిసంవత్సరముల ప్రాయము వీనికి. ఆంగ్లేయభాష కొంత యభ్యసించినను నాయనకుంబోలె నంత వ్యవహారజ్ఞానమలవడినదికాదు. శౌర్యధైర్యములు సహజసిద్ధములే కాని సంసారభారవహనము చక్కగా నేర్చుకొనవలసివచ్చినది. అప్పటి ధరలను బట్టి యష్టాదశసహస్రరూప్య మూల్యమగు నాస్తి, అయిదాఱువేల రూపాయల ఋణము, అరక వ్యవసాయము, అవివాహితులగు ననుజులు, అవివాహితయు నర్భకయు నగు ననుఁగుం జెలియలు, అమ్మ, ఆమె చెల్లెలు, - ఆంజనేయు లట్టికుటుంబమున కాధారభూతుఁడయ్యెను. అన్న యున్నప్పు డప్పులవా రడుగలేక యడుగలేక యాయన యరుగుటతోడనే యలజడి గలిగింప యత్నించిరి. అందుల కొద్యుఁ డతిసమీపస్థ గుండ్లపల్లి గ్రామనివాసి శ్రీగిరిరాజు రాఘవయ్యగారు. అయన యాసన్నమరణుఁడగు నన్న పేరనే రిజెస్టరునోటీ సిచ్చినవాఁడు. కాని యానోటీసునుగూడ నన్న యవలోకించుట కనిష్టముగలవానివలె నమరపురి కరుగుటయు నాయనను దహనముచేసి వచ్చుటతోడనే యయ్యది యాంజనేయులకుఁ దెచ్చి యీఁబడినది. పితృవియోగదుఃఖపీడితుఁడగు వీఁడది పుచ్చుకొనువేళ విప్రలాప మేదో విడిచెనని వెంటనే రాఘవయ్యగారికిఁ గబురు పోయినది. కంప్లెంటుగూడఁ గావించునన్న భయముచే నాశౌచమధ్యమున నేనే రాఘవయ్యయొద్ద కరిగితిని. నెలదినములకు నేనే నీయప్పు దీర్చెదనని యనునయించి వచ్చితిని.